WWW.ninadam.co.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం, ఫిబ్రవరి 18, 2025 | సంపుటి - 21 | సంచిక 153 | వెల - 7 | పేజీలు -12 + 8

Published from Hyderabad and Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Anantapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

### సమత కావాలంటే

సోమరి తనానికి బానిసై బంధించబడిన విలాసపు గాలులు స్వతంత్రంగా వీచి నప్పుడు.. ఈ వ్యవస్థను అందంగా స్థాపించిన మాట్లాడలేని చెట్లను బిగ్గరగా అల్లుకు పోయిన ఇనుప తీగల పట్టు సడలి వాటిని వదిలినప్పుడు.. నా తల్లి గర్భంలో పచ్చగడ్డి సమంగా మొలుస్తుంది. ప్రతి ముంగిలీ ముగ్గులతో నవ్వుతుంది..

- అలిశెట్టి ప్రభాకర్.

## ఆరోగ్య సంరక్షణలో ఇండియా గ్లోబల్ లీడర్



- సీఎస్ఆర్ వైస్ ఛైర్‌పర్సన్ ఉపాసన కామినేని

ఆరోగ్య సంరక్షణ, సరికొత్త ఆవిష్కరణల విషయంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఉందని, అపోలో సీఎస్ఆర్ వైస్ ఛైర్‌పర్సన్ ఉపాసన కామినేని పునరుద్ఘాటించారు. బోస్టన్‌లో జరిగిన హార్వర్డ్ ఇండియా బిజినెస్ ఫోరమ్ 2025లో ఆమె పాల్గొని ప్రసంగించారు.

వివరాలు 2లో..

# అక్రమార్కులను వదలబోం

## ఇసుక అక్రమ దందాపై కఠిన చర్యలు

- చర్యలు తీసుకోవాలని ఆదేశం
- ఇసుక అక్రమాలపై సిఎం సమీక్ష

**కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలి**

- ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో సత్వర చర్యలు

**వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు**

- క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించాలి
- అధికారులకు సిఎం రేవంత్ ఆదేశాలు



**హైదరాబాద్, నినాదం:**

అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అణచివేయాలని సంబంధిత శాఖల అధికారులను సీఎం ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక సరఫరా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకు తగినంత ఇసుక కావాలంటే ముందుగా అక్రమార్కులపై కొరడా ఝుళిపించాలని సీఎం సూచించారు. ఇదిలా ఉండిగా ఇందిరమ్మ పథకం కింద లబ్ధిదారులకు రూ. 5 లక్షలు అందించనున్నారు.

2

ఇసుక అక్రమ రవాణాపై కొరడా ఝుళిపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అక్రమార్కులను వదిలేది లేదని హెచ్చరించారు. అక్రమదందాకు పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశంచారు. సోమవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంట అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, ఈ సమస్యపై సమగ్రంగా చర్చించారు.



ఎన్టీపీసీకి చెందిన బూడిద చెరువు

### బూడిద తరలింపు పేరుతో బురిడీ

- నగం గమ్యానికి, నగం సొంతానికి
- బండి నెంబర్ ప్లేట్లు మార్చి మోసం
- సంస్థకు రోజు రూ. కోటి పైనే చిల్లు

# ఎన్టీపీసీకి ధోకా !

## దొంగలకు డబుల్ ధమాకా

### లీడర్లకు కోట్లు, అధికారులకు నోట్లు

**స్టేట్ బ్యూరో ఫిబ్రవరి 17(నినాదం):**

అవినీతి కాంట్రాక్టర్లు కల్గిన ఏ సంస్థయినా అయితే గియితే కొంతమేర తన సరుకును మాత్రమే కోల్పోతుంది. ప్రముఖ విద్యుత్ సంస్థ ఎన్టీపీసీ మాత్రం సరుకుతోపాటు ఖజానాలోని సొమ్మును సైతం కోల్పోతోంది. కంపనీ కళ్లుగప్పి సదరు కాంట్రాక్టర్లు సాగిస్తున్న దోపిడీ నిత్యం రూ 50 లక్షల పైమాటేనట.దీనికి అడ్డొచ్చిన ప్రముఖ లీడర్లకు కోట్లు,దారిలో కలిసే అధికారులకు సైతం నోట్లు ముట్టజెబుతారట.బూడిద డీసిల్టేషన్ ప్రక్రియ ఎన్టీపీసీ ఖజానాకు అతిపెద్ద చిల్లుపెడుతోంది.ఎంతో కాలంగా అతి రొటీన్ గా సాగుతున్న ఇక్కడి అక్రమాలవైపు నినాదం తొంగిచూసింది.

### రోజు సంపాదన కోటి పైనే..

ఇలా నేషనల్ హైవే పేరుతో ప్రయివేటు లారీల ఓనర్లనుండి లోడింగ్ కు ఒక్కో లారీకి రూ 08 వేలు తీసుకుంటుండగా, సదరు లారీల ఓనర్లు దూరాన్నిబట్టి రూ 12 నుండి50 వేల వరకు అమ్ము కుంటున్నరు. ఈ క్రమంలో నిత్యం సుమారు కోటి రూపాయలు జేబులో వేసుకుంటున్నరు.

కాగా దందాలో సాగుతున్న ఓవర్ లోడ్,ఏ ఏ శాఖల అధికారుల నెలసరి మామూళ్లు ఎంతెంత అనే పూర్తి వివరాలు నినాదం తరువాతి సంచికలో.



2లో..



ఓవర్ లోడ్ తో వెల్తున్న బూడిద లారీలు

### అసలీ బూడిదకథేంటి ?

పెద్దపల్లి జిల్లాలోని రామగుండం థర్మల్ పవర్ స్టేషన్(ఎన్టీపీసీ) నిర్వహణలో భాగంగా వ్యర్థాన్ని బయటికి వొదులు తుంది.దీనికోసం సంస్థబాధ్యులు ఓ ప్రత్యేక చెరువును ఏర్పాటు చేసి అందులో నిల్వ ఉంచుతారు.ఈ క్రమంలో నిల్వస్థాయిదాటగానే డీ సిల్టేషన్ చేస్తారు.లేని పక్షంలో బూడిద నిర్ణీత స్థాయిని మించి స్థానికంగా పొల్యూషన్ సమస్యకు దారితీస్తుంది. అదే జరిగితే పొల్యూషన్ బోర్డుకు నిబంధనల ప్రకారం ఎన్టీపీసీ పెనాల్టీ చెల్లించాల్సిఉంటుంది.కాగా ఆ పరిస్థితి రాకుండా చెరువు నిల్వను బట్టి నిరంతరం ఖాళీ చేస్తూ ఉంటారు.

## రాష్ట్ర కాంగ్రెస్‌లో అయోమయం



వివరాలు 2లో..

- దీపాదాస్ మున్షీ మార్పు దేనికి సంకేతం
- మీనాక్షి నటరాజన్ నియామకం కలసి వచ్చేనా



2

## ఢిల్లీ బీజేఎల్పీ సమవేశం 19కి వాయిదా

### సిఎం ఎంపికలో బిజెపి మల్లగుల్లాలు

**న్యూఢిల్లీ, నినాదం:**

ఢిల్లీ బీజేపీ శాసనసభాపక్ష సమావేశం వాయిదా పడిరది. సోమవారం జరగాల్సిన బీజేఎల్పీ సమావేశాన్ని అధిష్ఠానం ఫిబ్రవరి 19 వతేదీ మంగళవారానికి వాయిదా వేసింది.

## గుంటూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- కూలీలతో వెళుతున్న ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఘటనా స్థలిలోనే ముగ్గురు మహిళా కూలీల దుర్మరణం
- ప్రమాద ఘటనపై సిఎం చంద్రబాబు, మంత్రుల దిగ్భ్రాంతి
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

5



## అప్పుల బాధతో నలుగురి ఆత్మహత్య

### మైసూరులో ఘటన

2

**బెంగళూరు, నినాదం:**

అప్పుల బాధ తట్టుకోలేక ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య చేసుకున్న ఘటన కర్నాటకలోని మైసూరులో జరిగింది. విశ్వేశ్వరయ్య నగర్‌లో నివసిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అప్పుల వారి ఒత్తిడి భరించలేకే ఓ కుటుంబం బలవంతంగా ప్రాణాలు తీసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు.



2

### ఆర్టీసీ ప్రయాణికులకు మరో గుడ్‌న్యూస్

తెలంగాణ టు బెంగళూరు వెళ్లే ప్రయాణికులకు 10శాతం రాయితీ

## కెంటకీ వరదల్లో 8కి చేరిన మృతుల సంఖ్య

### జార్జియా, ఫ్లోరిడాలకు టోర్నడో హెచ్చరికలు జారీ

**న్యూయార్క్, నినాదం:**

అమెరికాలోని కెంటకీలో వచ్చిన మెరుపు వరదల్లో మృతుల సంఖ్య పెరిగి 8కి చేరింది. అక్కడి ఒబియాన్ నదికి సంరక్షణగా నిర్మించిన కట్ట తెగిపోవడంతో ఒక్కసారిగా సమీప ప్రాంతాలు జలమయం అయ్యాయని ఒబియాన్ కౌంటీ మేయర్ వెల్లడించారు.

2

## ఖమ్మం స్టేషన్‌లో చురుకుగా పునరుద్ధరణ పనులు

### ఖమ్మం మీదుగా పలు రైళ్ల రద్దు

**ఖమ్మం, నినాదం:**

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కాజీపేట-విజయవాడమధ్య మూడో రైల్వే లైన్ పనులు చకచక కొనసాగుతున్నాయి. రైల్వే అమృత్ పథకం కింద ఈ పనులు చేపట్టారు. ఖమ్మం మీదుగా హైదరాబాద్, వరంగల్, విజయవాడ పరిధిలో పలు రైళ్లను రద్దు చేసి మరీ వేగంగా పనులు చేస్తున్నారు. ప్రస్తుతం ఖమ్మం రైల్వే స్టేషన్ సమీపంలో ఇంటర్‌లాకింగ్ పనులు జరుగుతున్నాయి. దీని కోసం ఖమ్మం రైల్వే స్టేషన్‌లో రెండో ప్లాట్ ఫామ్‌ను కొంత మేర కూల్చివేశారు.



## కుటుంబ కలహాలతో నిండు ప్రాణం బలి

భార్య, పిల్లలను చూడటానికి వెళ్తే... నిప్పటించిన అత్తారింటివారు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

2

**కొత్తగూడెం, నినాదం:**

కుటుంబ కలహాలు నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నాయి. దంపతుల మధ్య కలహాలు రావడంతో భార్య అలిగి పుట్టింటికి వెళ్లింది. తర్వాత భర్త.. అత్తగారింటికి



## పెద్దగట్టు జాతర ప్రారంభం

- ఎటుచూసినా జనసంద్రం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి ప్రత్యేక పూజలు
- ఈనెల 20 వరకు ట్రాఫిక్ మళ్లింపు
- డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

4

- పెద్దగట్టు జాతరతో ట్రాఫిక్ ఆంక్షలు
- హైదరాబాద్-విజయవాడ మధ్య దారి మళ్లింపులు

**సూర్యాపేట, నినాదం:**

శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర ప్రారంభమైంది. ఆదివారం అర్ధరాత్రి దేవరపెట్టె చేరుకోవడంతో దురాజ్ పల్లి పెద్దగట్టు జాతర ప్రారంభమైంది. 'ఓ లింగ ఓ లింగా' నామస్మరణతో పెద్దగట్టు మారుమ్రోగుతోంది. గుట్ట చుట్టూ వాహనాలు చేరి.. జాతర భక్త జనసంద్రంగా మారింది. సోమవారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి లింగమంతుల స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

## ఎపిలో ఆందోళనకరంగా జీబీఎస్ కేసులు

- వివిధ జిల్లాల్లో 17 జీబీఎస్ కేసులు నమోదు
- ప్రమాదం లేదంటున్న మంత్రులు

5






# ఆరోగ్య సంరక్షణలో ఇండియా గ్లోబల్ లీడర్



**బోస్టన్, (నినాదం):**
ఆరోగ్య సంరక్షణ, సరికొత్త ఆవిష్కరణల విషయంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఉందని, అపోలో సీఎస్ఆర్ వైస్ ఛైర్‌పర్సన్ ఉపాసన కామినేని పునరుద్ఘాటించారు. బోస్టన్‌లో జరిగిన హార్వర్డ్ ఇండియా బిజినెస్ ఫోరమ్ 2025లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఆరోగ్యం విషయంలో నేడు అందివచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయం తీసుకోవడంతో పాటు, భారత్ అనుసరించే సంప్రదాయ ఆరోగ్య సంరక్షణ పద్ధతులు అనేక సమస్యలకు పరిష్కారం చూపుతున్నాయన్నారు. అంతేకాకుండా, ప్రపంచానికే పరిష్కార మార్గాలను చూపిస్తున్నామని తెలిపారు. హెల్త్‌కేర్ రంగంలో ఏఐ, బిగ్ డేటాను ఏవిధంగా విస్తృతంగా వాడుతున్నదీ.. దాని సాయంతో వ్యాధి లక్షణాలు, నిర్ధారణ, తదితర విషయాలను రియల్‌టైమ్‌లో ఎలా అంచనా వేస్తున్నదీ ఉపాసన వివరించారు. అసలు వ్యాధుల బారిన పడకుండా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేస్తూనే, ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించి తగిన వైద్యం అందించే విషయంలోనూ తన అభిప్రాయాలను పంచుకున్నారు. డిజిటల్ హెల్త్, యూపీఐ చెల్లింపులు, మారుమూల ప్రాంతాలకు టెలిమెడిసన్ ద్వారా వైద్య సేవలు అందించటం, భారత్‌లో ముఖ్యంగా హెల్త్, టెక్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ఉన్న అవకాశాలపై ప్రధానంగా చర్చించారు. 'భవిష్యత్‌లో ఆరోగ్య సంరక్షణకు చేయాల్సింది వీలైనన్ని ఎక్కువ ఆస్పత్రులు కట్టడం కాదు. ప్రజలకు వాటి అవసరమే రాకుండా చేయటం. భారత్ ఇందుకు సంబంధించిన బ్లూప్రింట్‌ను సిద్ధం చేస్తోందని పేర్కొన్నారు.

# ఢిల్లీ బీజేఎల్పీ సమవేశం 19కి వాయిదా

దీంతో తదుపరి సిఎం ఎవరన్న విషయం మరింత ఆలస్యం కానుంది. 8ననే ఫలితాలు వచ్చినా సిఎం అభ్యర్థిని ఎంపికచేయడంలో బిజెపి మల్లగుల్లాలు పడుతోంది. సోమవారం ఢల్లీ నూతన ముఖ్యమంత్రి ఎవరనే విషయానికి తెరపడుతుందని అంతా భావించారు. కాగా, ఢల్లీ పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన సమావేశం వాయిదా పడిరది. దీంతో నూతన సీఎంపై ఉత్కంఠ కొనసాగుతున్న వేళ మరో రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఫిబ్రవరి 19న జరిగే సమావేశంలో బీజేఎల్పీ నేతను ఎన్నుకోనున్నారు. ఈ సమావేశంలో నూతనంగా ఎన్నికైన 48 మంది బీజేపీ ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. అలాగే కమలం పార్టీ ఎంపీలు సైతం హాజరుకానున్నారు. బీజేఎల్పీ నేత ఎన్నిక తర్వాత ఎమ్మెల్యేలు లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలవనున్నారు. ఇప్పటికే ఢల్లీ ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం కోర్డినేటర్లుగా వినోద్ తావ్డే, తరుణ్ చుగ్‌లను బీజేపీ అధిష్ఠానం నియమించింది. మరోవైపు ఫిబ్రవరి 20న ముఖ్యమంత్రి, మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి తేదీ సైతం ఖరారు చేసింది. కాగా, ఢల్లీ ముఖ్యమంత్రి రేసులో పర్వేష్ వర్మ(న్యూ ఢల్లీ), రేఖా గుప్తా (షాలిమార్ బాగ్), విజేందర్ గుప్తా (రోహిణి), సతీష్ ఉపాధ్యాయ్ (మాల్వియా నగర్), ఆశిష్ సూద్ (జనక్‌పురి), పవన్ శర్మ (ఉత్తమ్ నగర్), అజయ్ మహావార్ (ఘోండా) ఉన్నారు. ఏడాది ఫిబ్రవరి 5న జరిగిన ఢల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం ఎగరవేసిన సంగతి తెలిసిందే. దాదాపు 27 ఏళ్ల తర్వాత కమలం పార్టీ అక్కడ అధికారంలోకి రానుంది. మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో 48 స్థానాలను బీజేపీ కైవలం చేసుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ కేవలం 22 స్థానాలకే పరిమితమైంది. ఆ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు పలువురు కీలక నేతలు ఓటమి పాలయ్యారు. కాగా, ప్రస్తుతం ఢల్లీ సీఎం ఎవరనే విషయం ఉత్కంఠ కొనసాగుతోంది

# ఆర్టీసీ ప్రయాణికులకు మరో గుడ్‌న్యూస్

**హైదరాబాద్, నినాదం:**
తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికులకు కాంగ్రెస్ ప్రభుత్వం మరోగుడ్‌న్యూస్ చెప్పింది. ఇప్పటికే తెలంగాణలో మహాలక్ష్మీ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా ఆధార్ కార్డ్ ఉన్న ప్రతి మహిళకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ప్రయాణ ఛార్జీలో ఏకంగా 10 శాతం రాయితీని ప్రకటించింది. అయితే ఇది అన్ని రూట్లలో కాదు. తెలంగాణ నుంచి బెంగళూరుకు ప్రయాణించే వారికి టిక్కెట్ ధరలో పది శాతం రాయితీ కల్పిస్తున్న ప్రకటించింది. బెంగళూరు రూట్‌లో నడిచే అన్ని సర్వీసుల్లోనూ రానుపోనూ ఈ రాయితీ వర్తించనుంది. ఈ రాయితీ వల్ల ఒక్కొక్కరికి రూ.100 నుంచి రూ.160 వరకూ ఆదా అవుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ రూట్ లో టికెట్ల ముందస్తు రిజర్వేషన్ కోసం వెబ్ సైట్‌ని సంప్రదించాల్సింది సూచించారు. అయితే తెలంగాణ నుంచి చాలా మంది బెంగళూరు సిటీకి వెళ్తుంటారు. వ్యాపార పనులపై, అలాగే ఉద్యోగ రిత్యా అక్కడ పనిచేసే వారు కూడా తరచూ బెంగళూరుకు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఇలాంటి వారికి ఇప్పుడు టీజీఎస్ ఆర్టీస్ ప్రకటించిన ఈ రాయితీ ఎంతో మేలు కూరుతుంది.

# అప్పుల బాధ్యతో నలుగురి ఆత్మహత్య

మృతులను మైసూర్‌కు చెందిన వ్యాపారి చేతన్ (45), అతని భార్య రూపాలి (43), కుమారుడు కుశాల్ (15), చేతన్ తల్లి ప్రియంవద (65) గా గుర్తించారు. భార్య, కుమారుడు, తల్లికి విషమిచ్చి చంపిన అనంతరం చేతన్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆత్మహత్యకు ముందు చేతన్ అమెరికాలో ఉన్న అతడి సోదరుడికి కాల్ చేసి, తాము కొంతకాలంగా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని.. అప్పుల వారినుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక కుటుంబంతో సహా ప్రాణాలు తీసుకుంటున్నట్లు చెప్పి ఫోన్ కట్ చేశాడు. అతడి సోదరుడు తిరిగి చాలాసార్లు ఫోన్ చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో స్థానికంగా ఉన్న బంధువులకు విషయం చెప్పాడు. వెంటనే వారు మైసూర్‌లో చేతన్ కుటుంబం నివసిస్తున్న సంకల్ప్ సెరీన్ అపార్ట్‌మెంట్‌కు చేరుకున్నారు. అయితే అప్పటికే అపార్ట్‌మెంట్‌లోని తమ ప్లాట్ లో చేతన్ ఉరివేసుకుని కనిపించగా, అతడి భార్య, కుమారుడు విగతజీవులుగా పడిఉన్నారు. పక్కనే ఉన్న మరో అపార్ట్‌మెంట్‌లోని ప్లాట్ లో అతడి తల్లి మృతదేహం కనిపించింది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని స్థానికులను విచారించారు. ఈ కుటుంబం గత పదేళ్లుగా అపార్ట్‌మెంట్‌లో నివసిస్తోందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు ఎప్పుడూ కనిపించలేదని వారు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# కెంటకీ వరదల్లో 8కి చేరిన మృతుల సంఖ్య

ఆ ప్రాంతంలో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. దీంతోపాటు ఆ ప్రాంతంలో విపత్తు సంభవించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతోపాటు ఫెడరల్ సహాయాన్ని కూడా ఆయన కేటాయించారు. జార్జియా, ఫ్లోరిడాలకు టోర్నడో హెచ్చరికలు జారీ చేశారు. ఆదివారం వచ్చిన వరద నుంచి వందల మందిని రక్షించినట్లు రాష్ట్ర గవర్నర్ ఆండీ బెషీర్ వెల్లడిరచారు. ఈ సంఖ్య 1,000 వరకు ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలో చాలాచోట్ల రోడ్లు మునిగిపోయాయి. కెంటకీలోని రివర్ మెడికల్ సెంటర్ ప్రాంతానికి కూడా వరద నీరు చొచ్చుకు రావడంతో చాలామంది పేషెంట్లను ఇతర ప్రాంతాలకు తరలించారు. 39,000 ఇళ్లల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. బలమైన గాలులు వీస్తుండటంతో మరిన్ని ప్రాంతాల్లో కరెంటు నిలిచిపోవచ్చని భావిస్తున్నారు. ఇక అమెరికా ఉత్తర ప్రాంతంలో ప్రాణాలు తోడేసేంత చలి ఉంది. జార్జియా, ఫ్లోరిడాలకు టోర్నడో హెచ్చరికలు జారీ అయ్యాయి. అట్లాంటాలో చెట్టు విరిగి ఇంటిపై పడటంతో ఒక వ్యక్తి మరణించారు. ఆర్కిటిక్ నుంచి వీస్తున్న చలిగాలుల కారణంగా నార్త్, సౌత్ డకోటా, మిన్నెసోటలోని కొన్నిచోట్ల –45.6 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు ఉష్ణోగ్రత పడిపోయింది.

# అక్రమార్కులను వదలం

**మొదటిపేజీ తరువాయి**

వాళ్ల ఖర్చును తగ్గించేందుకు ఇసుకను ఉచితంగా అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంది. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని విజయవంతంగా అమలు చేయడానికి అక్రమ రవాణా అడ్డుకట్ట తప్పనిసరి అని సీఎం పేర్కొన్నారు. అందుకే, అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపడంతోపాటు, ప్రభుత్వ పథకాలకు అవసరమైన ఇసుక సరఫరా నిరాటంకంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



## కొత్త రేషన్ కార్డుల జారీకి సిఎం ఆదేశం

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోలేని జిల్లాలో వెంటనే కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో పౌరసరఫరాల శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రేషన్ కార్డులపై సన్న బియ్యం పంపిణీ, కొత్త కార్డుల జారీపై అధికారులతో చర్చించారు. అలాగే.. ప్రభుత్వం జారీ చేయనున్న కొత్త రేషన్ కార్డులకు సంబంధించి పలు డిజైన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. అర్హులందరికి రేషన్ కార్డులు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. అలాగే.. వచ్చే ఉగాది నుంచి రేషన్ కార్డులపై సన్న బియ్యం పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఒకసారి రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీమళ్లీ దరఖాస్తు చేసుకోవద్దని.. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జనవరి 26న కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఆగిపోయింది. కొందరికి రేషన్ కార్డులు జారీ చేసి.. మరికొందరికి ఇవ్వకపోవడంతో దరఖాస్తుదారుల్లో అయోమయం నెలకొంది. దీంతో అప్రమత్తమైన సీఎం రేవంత్.. రేషన్ కార్డుల జారీపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎమెల్సీ కోడ్ అమల్లో లేని జిల్లాలో వెంటనే రేషన్ కార్డులు జారీ చేయాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే.. ఖమ్మం, నల్లగొండ, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలో మాత్రం ఎన్నికల కోడ్ అమల్లో లేదు. సీఎం ఆదేశాలతో ఈ మూడు జిల్లాల్లో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ షురూ కానుంది.

తెలంగాణ రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించి కమిషనర్ శాసనాలు ఇవ్వడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ అర్హులందరికీ అందుబాటులోకి రానివ్వాలని, ఈ ప్రక్రియ త్వరగా ప్రారంభించమని ఆయన్ని కోరారు. ఈ సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్న జిల్లా కేంద్రాలు మినహాయించి హబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ వంటి జిల్లాల్లో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించనున్నారు. రేషన్ కార్డుల తొలగింపు విధానంలో ఎన్నికల కోడ్ ఉనికి చాలా సమయానికి మలచేందుకు గమనించి, మొదటి సారి ఎంపిక చేయడానికి ప్రత్యుత్తరంగా జారీ లో తిరుగుబాటు పనిలో దీర్ఘ కార్యక్రమాలు ఉండాయి.

# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు



రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో ఎక్కడా మంచినీటి సమస్యరాకుండా చూడాలని సాగు,తాగునీటిపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు జారీచేశారు. ఎండాకాలంలో ఎక్కడా తాగు,సాగునీటి సమస్య రావొద్దని..ప్రణాళిక ప్రకారం అధికారులు ముందుకెళ్లాలని ఆదేశించారు. ఎండలు పెరిగే కొద్దీ గడ్డు పరిస్థితులు తలెత్తుతాయి..రాబోయే 3 నెలలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు క్షేత్ర స్థాయికెళ్లి పరిస్థితులను అంచనా వేయాలని చెప్పారు. పంటలు ఎండిపోకుండా ముందే జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు సీఎం రేవంత్. కొత్త రేషన్ కార్డులు జారీ, తాగు, సాగునీరు, ఇసుక అక్రమ రవాణాపై సీఎం రేవంత్ రెడ్డి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.రాష్ట్రంలోని జలాశయాల్లో నీటి నిల్వలపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు.ప్రాజెక్టుల్లో నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.శ్రీశైలం,నాగార్జున సాగర్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు రేవంత్. నిర్ణీత కోటా కంటే ఏపీ ఎక్కువ నీటిని తరలించకుండా చూడాలి.. దీని టెలిమెట్రీ విధానం అమలు చేయాలని ఆదేశించారు. టెలిమెట్రీ విధానానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రాష్ట్రంలోని ఇసుక రీచ్‌లలో వెంటనే తనిఖీలు చేపట్టాలని సీఎం రేవంత్.. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని సంబంధిత శాఖ అధికారులకు చెప్పారు. ఓవర్ లోడ్, అక్రమ రవాణాపై విజిలెన్స్ దాడులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# తొక్కిసలాట ఘటనతో రైల్వేశాఖ అప్రమత్తం

**రద్దీ నియంత్రణ కోసం ప్రత్యేక హోల్డింగ్ జోన్స్**

న్యూఢిల్లీ :
దేశ రాజధానిలోని న్యూదిల్లీ రైల్వేస్టేషన్‌లో గత శనివారం జరిగిన తొక్కిసలాట ఘటన యావత్ దేశాన్ని తీవ్రంగా కలచివేసింది. కుంభమేళా కోసం ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే ప్రయాణికులు పోటెత్తడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. రైలు వద్ద, ప్లాట్‌ఫాంపై గందరగోళంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో రైల్వేశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. స్టేషన్లలో రద్దీ నియంత్రణ కోసం ప్రత్యేక హోల్డింగ్ జోన్స్‌ను ఏర్పాటుచేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా అత్యధిక ట్రాఫిక్ ఉండే 60 రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు శాశ్వత హోల్డింగ్ ప్రాంతాలను నిర్మించాలని కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం. అంతేగాక, రద్దీ నియంత్రణ, విపత్తు నిర్వహణ కోసం కృత్రిమ మేధను వినియోగించనున్నట్లు సదరు కథనాలు వెల్లడిరచాయి. దీనిపై అవగాహన కల్పించేందుకు స్థానిక అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారట. ఈ హోల్డింగ్ ఏరియాల వద్దకు ప్రయాణికులు వెళ్లేందుకు వీలుగా సెపరేటర్లు, గుర్తులు ఏర్పాటుచేయనున్నట్లు తెలుస్తోంది. న్యూదిల్లీ రైల్వేస్టేషన్‌లో గత శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కుంభమేళాకు వెళ్లే వారితో రైల్వేస్టేషన్‌లోని 14, 15వ ప్లాట్‌ఫాంలు కిక్కిరిసిపోయి ఉన్నాయి. 14వ నంబరు ప్లాట్‌ఫాం పైకి ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ రావాల్సిఉంది.

# ఎన్టీపీసీకి ధోకా!

## దొంగలకు డబుల్ ధమాకా

**బూడిద ఎలా ఎక్కడికి చేరాలి ?...**

పై నేపథ్యంలో స్థానిక కుందనపల్లిలోగల ఎన్టీపీసీ సంస్థ బూడిద డీసిల్టేషన్ కోసం డిబిఎల్,హెచ్ జి,ఎఆర్ఎం మొదలగు సంస్థలకు కాట్రాక్టులు ఇచ్చింది.కాగా సదరు కాంట్రాక్టర్లు ఈ బూడిదను వరంగల్ టు నిజామాబాద్,ఖమ్మం టు వైజాగ్ మొదలగు హైవేలకు తరలించాల్సిఉంటుంది.అందుకు గాను లోడింగ్,ట్రాన్స్ పోటేషన్ ఖర్చులు సైతం ఎన్టీపీసీయే భరిస్తుంది.

**గమ్యానికి చేరేది సగమే.....**

ఇంతవరకూ బాగానే ఉన్నా అసలు కథ ఇక్కడే మొదలవుతుంది. పై విధంగా లోడైన లారీలు సూచించిన నేషనల్ హైవేలకు సగం,మిగతావి దారి మళ్లిస్తారు. హైదరాబాద్, సిద్దిపేట, కరీంనగర్, సుల్తానాబాద్,హన్మకొండ, హుజూరాబాద్ మొదలగు ప్రాంతాల్లోని ఇటుకబట్టీలకు అమ్ముకుని కోట్లు గడిస్తున్నారు.ఏర్పాటు చేసిన జిపిఎస్ లను ఏమార్చి,లారీల నెంబర్ ప్లేట్లను సైతం మార్చి కొద్ది లారీలనే మొత్తంగా చూపిస్తున్నారు. ఈ క్రమంలో ఎన్టీపీసీకి ధోకా ఇచ్చి బూడిదతో పాటు నిర్వహణ ఖర్చులు సైతం కాజేస్తూ డబుల్ ధమాకా పొందుతున్నారు.

**సబ్ కాంట్రాక్టర్ల దోపిడి ....**

బూడిద తరలింపులో భాగంగా ఎన్టీపీసీనుండి 3 నుండి నలుగురు బడా కాంట్రాక్టర్లు పనులు పొందగా,వారినుండి 5నుండి 07 గురు సబ్ కాంట్రాక్టర్లు తీసుకుని అక్రమ విధ్వంసానికి పాల్పడుతున్నారు.అలాగే వీరు నిర్ణీత సంఖ్యలో లారీలను కేటాయించుకొని ఎన్టీపీసీనుండి అనుమతులు పొందుతారు.ఆపేరుతో పెద్దమొత్తంలో లారీలను నిర్ణీత గమ్యానికి బదులు బయటకి అమ్ముకుని లక్షలాది రూపాయల బిల్లులు మాత్రం ఎన్టీపీసీనుండి తీసుకుంటారు. ఈ తంతుకు అడ్డొచ్చిన బడా లీడర్లకు కోట్లు,దారిలో ఎదురయ్యే సంబంధిత శాఖల అధికారులకు నోట్లు ముట్టజెపుతారు. విషయం లీకై ప్రశ్నిస్తే చివరకు ఎన్టీపీసి అధికారుల్ని సైతం రాజకీయ బలంతో బెదిరింపులకు గురిచేస్తున్నారు. ఒక్కో ఏజెన్సీకి సుమారు వంద ప్రయివేటు బండ్లను నింపి వాటికి సైతం ఎన్టీపీసీనుండే బిల్లు వేసి బయటకు అమ్ముకుంటున్నారు.



# కుటుంబ కలహాలతో నిండుప్రాణం బలి

వెళ్లి భార్య పిల్లలను చూద్దామనుకుంటే.. అత్తింటి వారు అతడిని అడ్డుకున్నారు. అంతేనా.. ఇంటి అల్లుడన్న విషయం మరచి అతడిపై అత్తామామ, బామ్మర్దులు ఏకంగా పెట్రోల్ పోసి నిప్పంటించి, ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. ఒళ్లంతా మంటలు రేగడంతో అతడు సమీపంలోని నీటి తొట్టిలో పడిపోయాడు. ఇరుగు పొరుగు గమనించి ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఈ దారుణ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం రామచంద్రునిపేటకు చెందిన ఎజ్జు వెంకటేశ్వర్లు, అనురాధ దంపతుల కుమార్తె కావ్య. ఆమెను మూడేండ్ల క్రితం పాల్వంచ మండలం దంతలబోరు గ్రామానికి చెందిన బల్లెం గౌతమ్ (24) ప్రేమ వివాహం చేసుకున్నాడు. గౌతమ్ ఎలక్ట్రిషన్ పనిచేస్తూ సుజాతనగర్‌లో నివాసం కాపురం పెట్టి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారికి ఇద్దరు ఆడ పిల్లలు. అయితే 5 నెలల క్రితం భార్యాభర్తలు గొడవ పడటంతో కావ్య అలిగి పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో ఫిబ్రవరి 2న రాత్రి భార్యా పిల్లలను చూసేందుకు గౌతమ్ అత్తింటికి వెళ్లాడు. అయితే అల్లుడు గౌతమ్‌ను అత్త మామ, బామ్మర్దులు ఇంట్లోనికి అనుమతించలేదు. దీంతో వారి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో వారు గౌతమ్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించి ఇంట్లోకెళ్లి తలుపులు వేసుకున్నారు. మంటలకు తాళలేక గౌతమ్ కేకలు వేస్తూ పక్కనే ఉన్న నీటితొట్టిలో పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని అతడిని ఇరుగు పొరుగు ఖమ్మం హాస్పిటల్‌కి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు అక్కడ నుంచి వరంగల్ ఎంజీఎంకి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ గౌతమ్ మృతి చెందాడు. మృతుడి తండ్రి బల్లెం వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఖమ్మం స్టేషన్‌లో చురుకుగా పునరుద్ధరణ పనులు

కొండపల్లి నుంచి కాజీపేట వరకు పలు స్టేషన్లలో ఇప్పటికే లైన్ నిర్మాణం పూర్తయింది. మిగిలిన చోట్ల పనులు స్పీడప్ చేసి జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొండపల్లి – మధిర మధ్య మూడో లైన్ నిర్మాణం పనులు పూర్తికాగా ఇటీవల ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. మధిర నుంచి మోటమర్రి వరకు మూడో లైన్‌ను మార్చి వరకు, మోటమర్రి నుంచి పందిళ్లపల్లి స్టేషన్? వరకు ఏప్రిల్ లోపు పనులు పూర్తి చేయాలని ఎ౩లాన్?చేస్తున్నారు. ఈ పనుల కారణంగా పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇదంతా పూర్తయ్యాక ఖమ్మం నుంచి డోర్నకల్ వరకు, ఆ తర్వాత మహబూబాబాద్‌వరకు పనులు చేయనున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కాజీపేట–విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్‌పనుల కారణంగా ఖమ్మం మీదుగా విజయవాడ, వరంగల్ వైపు వెళ్లే పలు రైళ్లను ఫిబ్రవరి 10 నుంచి 20వ తేదీ వరకు రద్దు చేశారు. మరికొన్ని రైళ్లను దారి మళ్లించారు. అయితే రద్దయిన రైళ్లలో కొన్నింటిని నిర్ణీత తేదీల్లో నడిపించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.భద్రాచలం – విజయవాడ, డోర్నకల్– విజయవాడ ప్యాసింజర్లు, గోల్కొండ, శాతవాహన, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈనెల 10 నుంచి పది రోజుల వరకు రద్దు చేశారు. ఖమ్మం మీదుగా నడిచే 107 రైళ్లలో 30 రైళ్లను పూర్తిగా రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని అధికారులు సూచించారు.




**IN THE COURT OF THE HON`BLE III ADDL JUNIOR CIVIL JUDGE, R.R.COURT AT : L.B.NAGAR**
**O.S.NO. 105 OF 2025**

BETWEEN:
Goraknath Singh and others ....Plaintiffs
A N D
K.Vijaya Bhaskar Reddy and All concerned ... Defendants

To
1.K.Vijaya Bhaskar Reddy, S/o.Late Narsimha Reddy Aged about 42 years, Occ: Business, R/o.H.No.1-50,Kurmalguda village,Balapur mandal, R.R.District.
2.All concerned ... Defendants

**NOTICE**

To
All concerned
That the plaintiffs filed the above suit for Declaration to declare the plaintiffs are the legal heirs of Late S.Sudha Singh who died on 29-11-2024 and to declare the plaintiffs are the owners and possessors of the open plot no.14 part and Plot no.15 part admeasuring 129 Sq.yds, in sy.no.757 (old) new Sy.no.757/2, situated at Nadergul village, Balapur mandal (the then Saroornagar mandal), Rangareddy District, under Badungpet Municipal corporation, registered at SRO, Champapet and bounded by NORTH:Plot no.15 parts, SOUTH:Plot no.13 part and plot no.14 part, EAST:Plot no.14 part and plot no.15 part, WEST: 30' Wide Road and successors of deceased Late S.Sudha Singh who died on 29-11-2024 against the defendants and the above case is posted on 17-03-2025 at 10:30 A.M. That if any person or persons having any objection or claim, they may appear either in person or through an advocate on 17-03-2025 at 10:30 A.M failing which the matter will be decided basing on the documents available on records.

(By order of the court)
K.Sada Siva Reddy
Advocate,
Off : 17-1-386/SN/9,
S.N.Reddy Nagar,
Saidabad. Hyderabad.
Cell : 9848996050

**IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD**
**O.S.No. 570 OF 2025**

Between:
1) Kankati Satyanarayana, S/o. Late Kankati Chandrajah.
2) Kankati Hanvika, D/o. Kankati Satyanarayana.
3) Kankati Pranav, S/o. Kankati Satyanarayana.
...Plaintiffs
AND
1. Tahasildar, MRO, Khairtabad, Hyderabad.
2. All Concerned, Hyderabad.
...Defendants

To,
All Concerned, Hyderabad.

Whereas the above named Plaintiffs have filed the above case for Declaration to declare that the Plaintiffs are legal heirs and successors of Kankati Anitha against the Defendants and case is posted to 17-03-2025 for appearance of All concerned.
] If you fail to appear either in person or through an advocate on the above said date and time at 10:30 am before the Hon'ble Court and the matter will be heard and decided Exparte.

**By order of the Court.**
**B. RAJESHWARB. COM.LLB**
**ADVOCATE**
**Office at # 13-6-955, Banjawadi, Karwan, Hyderabad-500 006, T.S.**
**Cell No.9849311458**




# కులగణన సర్వేతో ప్రభుత్వం అభాసుపాలు !

ప్రధాని మోడీ బిసి కాదు..ఆయన కులం తరవాత బిసిలో చేరింది...అందుకే మోడీ బిసి అయ్యారు. అందువల్ల ముందునుంచీ ప్రధాని మోడీ బిసి కాదు...ఈ విసయాన్ని ఇటీవల సిఎం రేవంత్ రెడ్డి ప్రస్తావిస్తూ.. అసలు మోడీ బిసియే కాదని సెలవిచ్చారు. ఇప్పుడు మోడీ బిసి అయినంత మాత్రన ఒరిగేదేమీ లేదు. కానందువల్ల వచ్చే నష్టం కూడా లేదు. బిసి కులగణన సందర్భంగా జరుగుతన్న విమర్శలకు సమాధానం ఇచ్చే క్రమంలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. నిజానికి రాజకీయాల్లో ఇలాంటి వ్యాఖ్యలే అస్థిరతకు కారణం అవుతాయి. తనకు రాజకీయల లబ్ది జరుగుతుందని భావించే సిఎం రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇందులో సందేహం లేదు. దీనిని బిజెపి నేతలు సభజంగానే తిప్పికొట్టారు. సిఎం రేవంత్‌పైనా విరుచుకు పడ్డారు. రాహుల్ కులమేంటో చెప్పాలన్న డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజలకు మేలుచేసేవి ఎంతమాత్రం కాదు. రెచ్చొగట్టే వ్యాఖ్యలతో రాజకీయాలను కలుషితం చేయరాదు. రాజకీయ నాయకులు అసలు విషయం మరచి, పాలనను మరచి ఇలాంటి వ్యాఖ్యలతో కాలక్షేపం చేస్తూ ఉంటారు. నిజానికి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 మాసాలు అవుతోంది. ఈ కాలంలో ఎన్ని మంచి పనులు చేశామో, ఎన్ని చేయలేకపోయామో ఆత్మవిమర్శల చేసు కోవాల్సి ఉంది. అలాగే కులగణనతో జరిగే లాభం అంతకన్నా లేదు. ఎందుకంటే కులగణనతో బిసి రిజర్వేషన్లు ఇచ్చే అధికారం ప్రభుత్వానికి లేదు. అసెంబ్లీలో కులగణన సర్వే ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఓ రకంగా అభాసు పాలయ్యింది. అందుకే మరోమారు రీ సర్వేకు ఆదేశించింది. తొందరపడి సర్వే చేపట్టడం కేవలం రాహుల్‌ను సంతృప్తి పరచే రాజకీయ విన్యాసం తప్ప మరోటి కాదు. రాహుల్ ఆదేశాలను పాటించేందుకే ఉన్నానని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు..కనుక ఈ తతంగం అంతా అందుకోసమే అని వేరుగా చెప్పనక్కరలేదు. ఈ క్రమంలోనే తీవ్ర విమర్శలు రావడంతో కలుగణన రీసర్వే మొదలైంది. ఈనెల 28 వరకు కులగణనలో నమోదు చేసేందుకు ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రజలు మూడంచెల విధానంలో రెండోసారి సర్వే చేస్తోంది సర్కార్. మరోవైపు రీసర్వేపైనా వి విపక్షాలు మర్శలు గుప్పిస్తున్నాయి. చిత్తశుద్ధిలేని సర్వేలు ఎన్నిసార్లు చేసిన బూడిదలో పోసిన పన్నీరే అంటున్నాయి. తెలంగాణలో కులగణన తప్పుల తడక అంటూ విపక్షాలు, బీసీ , ఎస్సీ ఎస్టీ సంఘాల నుంచి విమర్శలు రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రీ సర్వే చేపట్టింది. కులగణనలో వివరాలు నమోదు చేసుకోనివారంతా ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరుతున్నారు. రెండోసారి సర్వేకోసం మూడంచెల విధానాన్ని అధికారులు అమలు చేస్తున్నారు. ఆన్‌లైన్ తో పాటు ఆఫ్ లైన్‌లోనూ వివరాలు సేకరిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశారు. ఈ టోల్ ఫ్రీ నెంబర్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుందని తెలిపారు. ఫోన్ చేసిన వారి ఇళ్లకి వెళ్లి ఎన్యుమరేటర్లు వివరాలు నమోదు చేసుకుంటున్నారు. కులగణనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏకంగా బీసీ కమిషన్ రంగంలోకి దిగింది. గతంలో నిర్వహించిన సర్వేలో మొత్తం కోటి 15లక్షల కుటుంబాలకు గాను కోటి12 లక్షల కుటుంబాలు సర్వేలో పాల్గొన్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో వెల్లడిరచింది. కులగణనలో పాల్గనని 3లక్షల 56వేల మంది కోసం రెండోసారి సర్వేకు అవకాశం కల్పించింది. మొత్తంగా సర్వే అభాసు పాలయ్యింది. పరస్పర విమర్శలు మిగిలాయి. మోడీ కులంతో పాటు, రాహుల్ కులం గురించి కూడా విమర్శలు రావడం చూస్తున్నాం. ఇకపోతే పాలనా పగ్గాలు చేపట్టిన తరవాత కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకోవడంలోనే రేవంత్ రెడ్డి కాలం గడిచి పోతోంది. ఢల్లీ ప్రదక్షిణలకే సమయం సరిపోవడం లేదు. ఢిల్లీ నేతలు కూడా తరచూ తిప్పించుకునే పనిని మానడం లేదు. ఇకపోతే మంత్రులు ఎవరికి వారు యమునాతీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. సిఎం రేవంత్ రెడ్డి పరిస్థితి దినదినగండంగా ఉంది. స్పష్టమైన పనులు చేపట్టలేదు. పాలనలో దూకుడు కనిపించడం లేదు. అందుకే ప్రజల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి మెల్లగా వ్యాపిస్తోంది. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ముద్ర పాలనపై ఇంకా పడలేదు. ఎందుకంటే కాంగ్రెస్ 15 నెలల పాలనలో ఏం జరిగిందో చెప్పడానికి పెద్దగా ఏమీ లేదు. కనీసం రేషన్ కార్డుల సంస్కరణలు జరగేలదు. కిలో బియ్యం ధరలను పెంచలేదు. ఖర్చులను తగ్గించుకోవడం లేదు. రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలతో ప్రజలను ఎంతోకాలం నమ్మించలేమని కాంగ్రెస్ నేతలు తెలుసుకుంటే మంచిది. బిసి కులగణన లాంటిది హడావిడిగా అమలు చేయడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం అభాసుపాలవుతోంది. రైతురుణ మాఫీ వల్ల లాభం కన్నా విమర్శలే ఎక్కువగా ఉన్నాయి. దాదాపు రూ.25వేల కోట్ల మేర రుణమాఫీ చేసినా ఆశించిన రాజకీయ ప్రయోజనం నెరవేరలేదు. రైతు రుణ మాఫీ చేసి కూడా విమర్శలు ఎదుర్కొంటున్నారు. రైతులు కూడా సంతృప్తిగా లేరు. రేషన్ కార్డుల పంపిణీ వ్యవహారంలో, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు స్వీకరణలో కూడా సరైన కసరత్తు సక్రమంగా జరగలేదు. ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని నిర్మించాలనే విషయంలో కూడా నేతల్లో స్పష్టత లేదు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలంటే సాధ్యమా అన్నది ఆలోచన చేయడం లేదు. పేదలకే రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు అన్న ధృడవైఖరి కొరవడిరది..మొత్తం మీద రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆశించిన మేర పనిచేయడం లేదన్న అభిప్రాయం వ్యాపిస్తోంది. ఈ వ్యతిరేక భావనను మొగ్గలోనే తొలగించని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరింత అప్రతిష్ఠపాలవుతుంది. కేంద్రంలోని కాంగ్రెస్ అధిష్టానం కూడా స్పష్టమైన నిర్ణయాలు ప్రకటించాలి. అదేపనిగా నేతలను ఢల్లీకి పిలించుకుని కాలక్షేపం చేసే ప్రయత్నాలు మానుకోవాలి. లేకుంటు కాంగ్రెస్ మారదన్న ధృడవైరికి ప్రజలు రాగలరు.

# రాష్ట్ర కాంగ్రెస్‌లో అయోమయ పరిస్థితులు?

**దీపాదాస్ మున్షీ మార్పు దేనికి సంకేతం**


**మీనాక్షి నటరాజన్ నియామకం కలసి వచ్చేనా**

హైదరాబాద్:

తెలంగాణలో కాంగ్రెస్ శ్రేణులను ఏకతాటి పైకి తేవడం, ప్రభుత్వంతో సమన్వయం చేయడంలో కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ పూర్తిగా విఫలం అయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. ఆమె పెద్దగా ప్రభావం చూపలేకపోయార. అలాగే పార్టీ శ్రేణులు కలసి నడిచేలా చేయలేకపోయారన్న అపవాదు ఉంది. ఈ క్రమంలో అనూహ్యంగా అమెను మార్చారు. ఆమె స్థానంలో మినాక్షి నటరాజన్ ను నియిమించారు. నిజానికి ఇది ఊహించని పరిణామం. ఇకపోతే బిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో మునిగిందంటూ విమర్శలు చేస్తున్న సిఎం రేవంత్ , మంత్రులు తమ హయాంలో జరుగుతున్న అవినీతి గురించి పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అందకే అవినీతి విషయంలో కూడా ప్రభుత్వంపై విమర్శలు మొదలయ్యాయి. కొంత మంది మంత్రులు ఒంటెద్దు పోకడలతో ఉన్నారు. ఇలాంటి వారిని మందలించి దారికితేవడంలో దీపాదాస్ మున్షీ విఫలం అయ్యారు. అలాగే ప్రభుత్వంలో తమకు ప్రాధాన్యం లేకుండా పోతోందని కొందరు శాసనసభ్యులు వాపోతున్నారు. వారు ప్రత్యేకంగా గ్రూప్ మీటింగ్‌లు పెట్టుకుంటున్నారు. ఎమ్మెల్యేలలో నెలకొన్న ఈ భావన అసంతృప్తికి దారి తీయకముందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేల్కొనడం మంచిది. అందుకే ముందుగా దీపాదాస్‌పై వేటు పడిరదన్న విమర్శా ఉంది. పార్టీ ఫండ్ కోసం తెలంగాణపై ఆధారపడుతున్న కాంగ్రెస్ అధిష్ఠానం ప్రభుత్వ పనితీరు మెరుగుకు మార్గదర్శనం చేయలేని పరిస్థితిలో ఉంది.

**కర్ణాటక కాంగ్రెస్ నాయకులు చేతులెత్తేయడంతో ప్రతి అవసరానికీ కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణపై ఆధారపడుతోంది.**

ఈ కారణంగా ప్రభుత్వంలో అవినీతి పెరగడానికి ఆస్కారం ఏర్పడుతోంది. ఈ క్రమంలోనే పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని మార్చడం ద్వారా కాంగ్రెస్ అధిష్ఠానం వ్యతిరేక సందేశం ఇచ్చిందని అంటున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా బాలారిష్టాలను అధిగమించలేదన్న భావన విస్తృతంగా ఉంది. ఈ కారణంగా ఎన్నికల ఫలితాల తర్వాత డీలా పడిపోయిన భారత రాష్ట్ర సమితిలో భవిష్యత్తుపై ఆశలు చిగురిస్తున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడే ప్రమాదం పొంచి ఉండటం కూడా రేవంత్ సర్కార్‌కు సవాలు కానుంది. సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పును ఇస్తుందో అన్న ఆసక్తి నెలకొంది. తమకు అనుకూలంగా తీర్పు వస్తుందన్న భరోసాలో బిఆర్ఎస్ ఉంది. సుప్రీం తీర్పు వల్ల ఉప ఎన్నికలు వస్తే ఫలితం ఎలా ఉంటుందోనన్న బెంగ పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలలో ఉంది. ఈ కారణంగా వారిలో కొందరు సొంతగూటికి చేరే ఆలోచన చేస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఇదే జరిగితే రేవంత్ సర్కార్‌కు నైతికంగా దెబ్బ తినగలదు.. కేటిఆర్ పదేపదే చెబుతున్నట్లుగా ప్రజలు బిఆర్ఎస్ పాలనకోసం ఎదురుచూడడం లేదుగానీ, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాత్రం పెదవి విరుస్తున్నారు. ఇకపోతే ఎదురుదాడి చేసే క్రమంలో సిఎం రేవంత్ రెడ్డి చేస్తున్న విమర్శలు లేదా వ్యాఖ్యలు లేనిపోని అనర్థాలను తీసుకుని వస్తున్నాయి.



# ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ పరమహంస

## ఫిబ్రవరి 18 రామకృష్ణ పరమహంస జయంతి

**మనదేశంలో భోగాలు అనుభవించిన రాజులే కాదు, ఎంతో జ్ఞానం కలిగి, తన బోధనలతో ఆధ్యాత్మిక ప్రపంచంలో మన దేశాన్ని ఉన్నత శిఖరాలలో నిలిపిన యోగులు కూడా ఉన్నారు. అలాంటి వారిలో రామకృష్ణ పరమహంస ఒకరు.**

**ఆధ్యాత్మిక గురువు:**

రామకృష్ణ పరమహంస గొప్ప సాధువు. ఆధ్యాత్మిక గురువు ఆలోచనాపరుడు. అన్ని మతాల ఐక్యతను నొక్కి చెప్పారు. చిన్నప్పటి నుంచి భగవంతుడిని చూడొచ్చని నమ్మేవారు. విభిన్న మతాలు భగవంతుడిని చేరడానికి విభిన్న మార్గాలు అని అనుభవపూర్వకంగా మొట్టమొదటిసారిగా ప్రపంచానికి చాటిచెప్పిన ఒక ఆధ్యాత్మిక వేత్త. ఈయన బోధనలు "బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనం, భక్తి ఉద్యమం" పై ప్రభావం చూపాయి. ఆది శంకరాచార్యులు వలే రామకృష్ణ పరమహంస 19 వ శతాబ్దములో హిందూ మతములో పేరుకు పోయిన అధిక సంప్రదాయములు, మూఢ నమ్మకాలను కొంతవరకూ తొలగించడానికి ప్రయత్నించారు.

పరమ హంస ప్రాచీనతకు, ఆధునికతకు మధ్య నిజమైన అనుసంధానకర్త. సాధారణ ఆధునిక జీవన విధానాన్ని అనుసరిస్తూనే కూడా ప్రాచీన ఆదర్శాలు, అనుభవాలను ఎలా సాకారం చేసుకోవచ్చో ఆయన చూపించారు. సత్యసంధత, కామం, దురాశలను త్యజించడంపై ఆయన ఇచ్చిన ప్రాధాన్యత ఆధునిక కాలంలో నైతిక జీవితానికి గొప్ప ప్రోత్సాహాన్ని ఇచ్చింది. ఆయన మతపరమైన జీవితాన్ని అనైతిక ఆచారాలు, బాహ్య ఆడంబరాలు, అద్భుతాలు మొదలైన వాటి నుండి శుద్ధి చేశారు.

**జననం - జీవనం:**

రామకృష్ణ 1836 ఫిబ్రవరి 18న పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని కామర్పుకూర్ గ్రామంలో ఖుదీరామ్ చటోపాధ్యాయ, చంద్రమణి దేవి దంపతులకు జన్మించారు. ఇతని చిన్ననాటి పేరు గదాధర్. పాఠశాల స్థాయిలో రామాయణ,మహాభారతంతో ఇతర మతపరమైన పుస్తకాలను భక్తితో చదివేవారు. రామకృష్ణ తండ్రి 1843లో మరణించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కుటుంబం మొత్తాన్ని పోషించడం కష్టంగా మారింది. ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. చిన్నారి గదాధర్ ధైర్యం తగ్గలేదు. దక్షిణేశ్వర్ కాళీ ఆలయానికి ప్రధాన పూజారిగా ఉన్న అన్నయ్య రామ్ కుమార్ 1856 లో మరణం తరువాత లోకపు అశాశ్వతాన్ని చూసి అతని మనస్సులో నిర్లిప్తత ఏర్పడింది. కాళీ ఆలయంలో పూజారిగా నియమించబడ్డారు. లోపల్నుంచి ఇష్టం లేకపోయినా శ్రీరామకృష్ణుల గుడికి పూజలు చేయడం మొదలుపెట్టారు. దక్షిణేశ్వర్ లోని పంచవటి వద్దదేవుడిని చూడాలనే ఆతృతతో ధ్యానం ప్రారంభించారు. తోతాపురి మహరాజ్ నుండి అద్వైత వేదాంత జ్ఞానాన్ని పొంది జీవన్ముక్త స్థితిని పొందారు. ఆయనకు శ్రీరామకృష్ణ పరమ హంస అని నామకరణం చేశారు. కాలక్రమేణా అతని కఠినమైన ఆధ్యాత్మిక అభ్యాసాలు, విజయాల వార్తలు వేగంగా వ్యాపించాయి. దక్షిణేశ్వర్లోని ఆలయ ఉద్యానవనం త్వరలోనే భక్తులకు, సన్యాసులకు ఇష్టమైన స్వర్గంగా మారింది. పండిట్ నారాయణ్ శాస్త్రి, పండిట్ పద్మలోచన్ తారాకల్కర్, వైష్ణవచరణ్, గౌరీకాంత తారకభూషణ్ వంటి గొప్ప పండితులు, ప్రసిద్ధ వైష్ణవ, తాంత్రిక అభ్యాసకులు ఆయన నుంచి ఆధ్యాత్మిక ప్రేరణ పొందారు. బెంగాల్ లో ఆలోచనలకు నాయకత్వం వహిస్తున్న అప్పటి ప్రసిద్ధ ఆలోచనాపరులతో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. వీరిలో కేశవ్ చంద్ర సేన్, విజయకృష్ణ గోస్వామి, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్ పేర్లను తీసుకోవచ్చు. కాలక్రమేణా అతని కఠినమైన ఆధ్యాత్మిక అభ్యాసాలు, విజయాల వార్తలు వేగంగా వ్యాపించాయి. దక్షిణేశ్వర్లోని ఆలయ ఉద్యానవనం త్వరలోనే భక్తులకు సన్యాసులకు ఇష్టమైన స్వర్గంగా మారింది. పండిట్ నారాయణ్ శాస్త్రి, పండిట్ పద్మలోచన్ తారాకల్కర్, వైష్ణవచరణ్, గౌరీకాంత తారకభూషణ్ వంటి గొప్ప పండితులు, ప్రసిద్ధ వైష్ణవ, అభ్యాసకులు ఆయన నుంచి ఆధ్యాత్మిక ప్రేరణ పొందారు.

**రామకృష్ణ మిషన్:**

రామకృష్ణులు తన ప్రత్యక్ష శిష్యులకు సన్యాసము ఇవ్వడము ద్వారా రామకృష్ణ మిషన్ను స్వయముగా ప్రారంభించారు. స్వామీ వివేకానంద రామకృష్ణుని సందేశాలను పాశ్చాత్య దేశాలకు వ్యాపింప చేశారు. అతనితో కొంతమంది మతపరమైన విషయాలలో ఏకీభవించనప్పటికీ చాలా గౌరవిస్తూ ఉండేవారు. భారతీయ నాగరికతపై బ్రిటిష్ వారి ఆక్రమణను ఎదిరించే శక్తిని అతనిలో గమనించేవారు. "20వ శతాబ్దపు గొప్ప నాయకులు వారి జీవనశైలి ఏదైనా కాని, కవి రవీంద్రనాథ్ టాగూర్, తత్వవేత్త అరబిందో ఘోష్, బ్రిటిష్ వారి ఆక్రమణను కూకటి వేళ్ళతో సహా పెకిలించిన మహాత్మా గాంధీ, భారతీయుల హృదయాన్ని కదిలించినందుకు రామకృష్ణునికి, భారతీయ ఆత్మను జాగృతం చేసినందుకు వివేకానందునకు ఘనతను ఆపాదించారు" అనిఅమోరీ దీ రెన్కోర్ అన్నారు.

**బోధనలు:**

రామకృష్ణుల వారు ప్రకృతి పరిశీలన, రోజువారీ జీవితంలోని సాధారణ విషయాల నుండి తీసుకోబడిన ఉపమానాలు, రూపకాలను ఉపయోగించి సరళమైన భాషలో మాట్లాడటానికి ఎంచుకున్నారు. ఆయన సంభాషణలు మనోహరంగా ఉండి ఎంతో మందిని ఆకర్షించాయి. " భగవంతుని దర్శించడం అందరికీ సాధ్యమే. గృహస్తులు ప్రపంచాన్ని వదిలి చేయనక్కర లేదు కాని వారు శ్రద్ధగా ప్రార్థించాలి. శాశ్వతమైన వస్తువులకు క్షణికమైన వస్తువులకు తేడా గమనించే వివేకం కావాలి. బంధాలను తగ్గించుకోవాలి. దేవుడు శ్రద్ధగా చేసే ప్రార్థనలను వింటాడు." "ఆధ్యాత్మిక జీవిత రహస్యం అని జ్ఞానం ఐకమత్యానికి, అజ్ఞానం కలహాలకి దారి తీస్తాయని తెలిపారు. కామం, అసూయ దేవుని దర్శనానికి రెండు ముఖ్య శత్రువులని ప్రవచించారు. "మానవ జీవిత లక్ష్యం పరమ సత్యాన్ని గ్రహించడమే. అదే మనిషికి అత్యున్నత సంతృప్తిని, శాశ్వత శాంతిని ఇవ్వగలదు. ఇదే అన్ని మతాల సారాంశం" పరమహంస బోధించారు.

**మరణం:**

1885 ప్రారంభంలో గొంతు వ్యాధితో బాధపడ్డారు. అది క్రమంగా గొంతు క్యాన్సర్‌గా మారింది. రామకృష్ణ పరమహంస తన జీవితపు చివరి రోజుల్లో అపస్మారక స్థితిలో జీవించడం ప్రారంభించారు. పరిస్థితి క్రమంగా దిగజారింది. అతను 1886 ఆగస్టు 16 కోసిపోర్ గార్డెన్ హౌస్‌లో మరణించారు.

**జనక మోహన రావు దుంగ**
**ఫోన్: 8247045230**




# ఢిల్లీ పరిసరాల్లో స్వల్ప ప్రకంపనలు

**రిక్టర్ స్కేల్ పై భూకంపం తీవ్రత 4.0 గా నమోదు**

**అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోడీ హెచ్చరిక**

న్యూఢిల్లీ:

దేశ రాజధాని న్యూఢిల్లీ తో పాటు పలు పరిసర ప్రాంతాల్లో సోమవారం భూకంపం సంభవించింది. తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో ప్రకంపనలు చోటుచేసుకోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తెల్లవారుజాము కొద్ది సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో భయాందోళనలకు గురైన ప్రజలు భయంతో రోడ్లపైకి పరుగులు తీశారు. రిక్టర్ స్కేల్ పై భూకంపం తీవ్రత 4.0 గా నమోదు అయింది. ఢల్లీతో పాటు నోయిడా, గురుగాం ప్రాంతాల్లో భూప్రకంపనలు సంభవించాయి. దేశ రాజధాని ఢల్లీలో స్వల్ప భూప్రంకపనలు వచ్చాయని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ ఎక్స్ వేదికగా తెలిపింది. భూకంప కేంద్రం లోతు కేవలం 5 కిలోమీటర్లు మాత్రమేనని స్పష్టం చేసింది. కొన్ని సెకన్ల పాటు మాత్రమే భూమి కంపించడంతో భయాందోళనలకు గురైన జనం ఇళ్లలోంచి బయటకు పరుగులు తీశారు. మంచం నుండి కిటికీ వరకు ప్రతిదీ కదలడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దిల్లీ, నోయిడా, గురుగ్రామ్ ప్రాంతాల్లో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 4.0గా నమోదైంది. ధౌలా కాన్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కాలేజీ సమీపంలో 5 కిలోమీటర్ల భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రకంపనలు సంభవించిన సమయంలో భారీ శబ్దం వినిపించడంతో ప్రజలు భయభ్రాంతులకు లోనయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఇప్పటివరకు ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. ఢల్లీలో సంభవించిన భూకంపంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. మళ్లీ భూప్రకంపనలు వచ్చే అవకాశం ఉందని... అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఢల్లీ పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయని, ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. భద్రతా చర్యలు పాటించాలని, పరిస్థితులను అధికారులు సునిశితంగా పరిశీలిస్తున్నారని ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'దిల్లీ, పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలి. భద్రతా చర్యలు పాటించాలి. మళ్లీ ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. పరిస్థితులను అధికారులు సునిశితంగా పరిశీలిస్తున్నారని ప్రధాని మోదీ వెల్లడిరచారు.




# పెద్దగట్టు జాతరతో ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్-విజయవాడ మధ్య దారి మళ్లింపులు**

హైదరాబాద్ :

హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి మధ్య రాకపోకల సాగిస్తున్న వారు ట్రాఫిక్ హెచ్చరికలు గమనించి పోవాల్సి ఉంది. ఎందుకంటే హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.. సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతర సందర్భంగా హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై పోలీసులు ఆంక్షలు విధించారు. లింగమంతుల స్వామి జాతర ఐదు రోజులపాటు జరిగనుంది.. ఈ జాతరకు లక్షలాదిమంది భక్తులు తరలివస్తున్నారు. తెలంగాణలో పెద్దగట్టు జాతరగా ప్రసిద్ధికెక్కిన లింగమంతుల స్వామి జాతర ప్రారంభమైంది. రాష్ట్రంలో మేడారం సమ్మక్క–సారలమ్మల జాతర తరువాత రెండవ అతిపెద్ద జాతరగా దీనికి పేరుంది. యాదవుల ఆరాధ్య దైవం లింగమంతుల స్వామి జాతర ఆదివారం అర్థ రాత్రి కేసరం నుంచి పెద్దగట్టు దేవరపెట్టె రాకతో అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఐదు రోజులపాటు జరగనున్న జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు. భక్తులు గజ్జెల లాగులు ధరించి, కత్తులు, కటర్లు, డప్పు వాయిద్యాలతో గుట్ట పైకి చేరుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు.. దీంతో జాతర జన సంద్రమైంది.. కాగా.. సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతర సందర్భంగా హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై పోలీసులు ఆంక్షలు విధించారు. జాతరకు వచ్చే భక్తులు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు జాతీయ రహదారిపై ఆంక్షలు విధించారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను నార్కెట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, కోదాడ మీదుగా విజయవాడకు మళ్లిస్తున్నారు. అలాగే, విజయవాడ నుంచి వచ్చే వాహనాలను కోదాడ, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కట్‌పల్లి మీదుగా హైదరాబాద్‌కు మళ్లిస్తున్నారు..

# బీసీలకు ప్రాధాన్యత కల్పించిన ఏకైక పార్టీ కాంగ్రెస్

- జాతీయ ఓబీసీ సెల్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ కెప్టెన్ అజయ్ సింగ్ యాదవ్



**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** బీసీలకు ప్రాధాన్యత కల్పించిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని జాతీయ ఓబీసీ సెల్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ కెప్టెన్ అజయ్ సింగ్ యాదవ్ అన్నారు. హైదరాబాద్, గాంధీ భవన్ లో తెలంగాణ రాష్ట్ర ఓబీసీ సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓబీసీ రాష్ట్ర స్థాయి సమావేశంలో రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, జిల్లా ఓబీసీ చైర్మన్ వంగ రవి యాదవ్ తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఇది వరకు వచ్చిన పార్టీలన్నీ బీసీల ఓట్లు దండుకుని సీట్లు గెలుచుకుని అందలం ఎక్కి బిసిలను విస్మరించారన్నారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ బీసీ కుల గణన చేసి జనాభా దామాషా ప్రకారం ప్రతి కులానికి సమాన వాటా దక్కేలా చేస్తానని ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ కుల గణన, సమగ్ర కుటుంబ సర్వే చేసి జనాభా దామాషా ప్రకారం బీసీలకు సమాన వాటా కల్పిస్తూ బీసీ రిజర్వేషన్లు 42శాతంకు పెంచి బీసీలకు అన్ని సంక్షేమ పథకాల్లో సమాన వాటా అందేలా కాంగ్రెస్ పార్టీ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని అన్నారు. ఇకనైనా బీసీ సమాజం మన ఓట్లతో గద్దెనెక్కే పార్టీలు కావాలా లేక మనకు సమాన వాటా కల్పించి మన లెక్క తేల్చిన కాంగ్రెస్ పార్టీ కావాలో నిర్ణయించుకోవాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ పథకంలో 42శాతం వాటా కల్పించిన సిఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు పొడాల ఓంప్రకాష్, మంగపేట మండల ఓబీసీ సెల్ అధ్యక్షులు ఆది నారాయణ, జిల్లా ఓబీసీ సెల్ కోశాధికారి ఓడ రాజు గౌడ్, మండల ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు బొంతల వేణు, ఓబీసీ సెల్ జిల్లా నాయకులు ఓజ్జల కుమార్, నటరాజ్, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాటబోయిన నరసింహారావు, చందర్లపాటి శ్రీనివాస్, తోట అశోక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## లక్నవరం లోతట్టు గ్రామాలకు సాగునీరు ఇవ్వాలి



**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** యాసంగి సీజన్‌లో పంటలు సాగు చేసిన లక్నవరం లోతట్టు గ్రామాలకు సాగునీరు అందించి పంటలను రక్షించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజాద్ పాషా కోరారు ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుగు మండలంలోని లోతట్టు గ్రామాలైన ఖన్నాయి గూడెం, పంచాయతీకిలపల్లి, రాయిని గూడెం, దుబ్బ గూడెం, లాలయ్య గూడెం, కొత్తూరు, సర్వాపూర్, జగ్గన్న గూడెం, అంకన్న గూడెం, పెగడపల్లి తదితర గ్రామాల్లో సుమారు 1500 ఎకరాలు యాసంగి సాగు చేస్తున్నారని తెలిపారు. లక్నవరం లోతట్టు ప్రాంతంలో ఆయా గ్రామాల రైతులకు తక్షణమే సాగునీరు ఇవ్వాలని ఆయన వినతిపత్రంలో కోరారు. అదేవిధంగా నల్లబెల్లి మండలం రంగయ్య చెరువు పైపులైన్ ద్వారా ములుగు మండలం అన్నంపెల్లి, తొర్రికుంటకు, పత్తిపల్లి గ్రామంలోని రంగయ్య చెరువు, ఎదలచెరువు, బుగ్గ చెరువుకు సాగునీరు అందించాలని, అదేవిధంగా ములుగు జిల్లాలోని సాగునీటి వనరులను ప్రభుత్వం ఉపయోగించుకొని బొగ్గుల వాగుపై ఆనకట్ట నిర్మించాలని అన్నారు. ములుగు మండలం లాలయగూడెం జగ్గన్నగూడెం గ్రామాల మధ్య. ఆనకట్ట నిర్మిస్తే సుమారు 6000 ఎకరాలకు భవిష్యత్తులో సాగునీరు వస్తుందని అన్నారు. వాజేడు మండలంలోని మండికుంట వద్ద సాగునీటి ప్రాజెక్టు నిర్మిస్తే సుమారు పదివేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, తాడ్వాయి మండలం నరసాపూర్ వద్ద జంపన్న వాగుపై ఆనకట్ట నిర్మిస్తే సుమారు 6000 ఎకరాలకు సాగునీరు వస్తదని. గత ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా మచ్చాపురం గ్రామానికి లక్నవరం చెరువు నూతన కాలువ ఇవ్వాలని. జిల్లాలోని అన్ని చెరువులకు కుంటలకు గోదావరి జలాలను అనుసంధానం చేయాలని ఆయన కోరారు. అలాగే ములుగు జిల్లాలోని పాలెం వాగు ప్రాజెక్టు నర్సింగ్ సాగర్ ప్రాజెక్టు రామప్ప లక్నవరం ఎస్సారెస్పీ కాలువల లైనింగ్ పనులు వెంటనే ప్రారంభించాలని, ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతం కనుక అనేకమైన వాగులు ఉన్నాయనొ, ఆ వాగులపైన చెక్ డ్యాంలు నిర్మిస్తే సుమారు జిల్లాలో 25వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోరిక వెంకటరమణ, మద్రి స్వామి, కొత్తకొండ సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేసిన ఎస్పీ



**డోర్నకల్ /మరిపెడ ఫిబ్రవరి 17(నినాదం న్యూస్ ):** ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపిఎస్ మరిపెడ సర్కిల్ మరియు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను స్టేషన్ లోపల 5 ఎస్ విధానాన్ని పరిశీలిం చారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు..సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలను ఎప్పటికప్పుడు విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని తెలిపారు.ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠినంగా వ్యవహరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మరిపెడ సీఐ రాజ్ కుమార్ గౌడ్,డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్సైలు సతీష్, సంతోష్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** ములుగు జిల్లా కేంద్రంలోని బాగ్య తండాలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే గ్రీన్ ఇండియా కార్యక్రమంలో బాగంగా మొక్కలు నాటారు. అనంతరం జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ ఆనాడు భాగ్యతండాలో జరిగిన ఓ విషాదం చూసి చలించి కళ్యాణలక్ష్మికి శ్రీకారం చుట్టారని, పేద ప్రజల కష్టాలను చూసే సంక్షేమ పథకాలకు రూపకల్పన చేశారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపించిన మాజీ సీఎం కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని ప్రస్తుత ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. కేసీఆర్ అంటేనే తెలంగాణ అని, తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన కేసీఆర్ ఆనవాళ్లను తొలగించడం ఎవరి వల్లా కాదని ఆయనస్పష్టం చేశారు. ఈ వేడుకల్లో మాజీ జడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి, మాజీ గ్రంథాలయ చైర్మన్ గోవింద్ గారు, ములుగు జిల్లా నియోజకవర్గ నాయకులు భూక్య జంపన్న గారు , మండల అధ్యక్షులు పాలెపు శ్రీనివాస్ గారు, వివిధ తాజా మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, టిఆర్ఎస్ యువ నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## ఉపాధ్యాయుల బోధనా శ్రమను గుర్తించాలి

### - పాఠశాల హెచ్ఎం ఎండి సర్వర్ అహ్మద్



**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** విద్యార్థులు ఉపాధ్యాయుల బోధన శ్రమను గుర్తించాలని, ఒకరోజు పాఠశాల నిర్వహణ చేసిన విద్యార్థులు అభినందనీయులని పాఠశాల హెచ్ఎం ఎండీ సర్వర్ అహ్మద్ అన్నారు. వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని నర్సింగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎండి సర్వర్ ఆధ్వర్యంలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులే ఉపాధ్యాయులై ఒకరోజు పాఠశాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించారు. విద్యార్థులలో సృజనాత్మకత వెలికి తీయాలని సంకల్పంతో చిన్న విద్యార్థులతో విద్య బోధన చేయించడం జరిగిందని తెలిపారు.. ఈ సందర్భాంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కాగా డిఈఓగా పొలం రిషి, ఎంఈఓగా సహజ్, ప్రధానోపాధ్యాయులు కోట సంజన, తెలుగు ఉపాధ్యాయులుగా అక్షిత, సాంబలక్ష్మి ,ఇంగ్లీషు ఉపాధ్యాయులుగా పార్థివ్ , సర్వేష్ మని, గణితం ఉపాధ్యాయులు రితిక వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం సుమన్, అంగన్వాడి టీచర్ ఎర్రబెల్లి సరోజన, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు



**మంగపేట, ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మ దిన వేడుకలను సోమవారం మంగ పేట మండల వ్యాప్తంగా బిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బి ఆర్ ఎస్ మండల శాఖ అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకుడు చిట్టిమల్ల సమ్మయ్యల ఆధ్వర్యంలో కెసిఆర్ పుట్టినరోజు వేడుకలను మండలంలోని తిమ్మంపేట క్రాస్ రోడ్డు వద్ద కేక్ కట్ చేసి ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున మొక్కలు నాటారు. ఒకరికొకరు సీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు కేసీఆర్ పాలనలో జరిగిన సంక్షేమ పథకాలను పాలనా కాలాన్ని స్వర్ణయుగంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజు యాదవ్, సహకార సంఘం చైర్మన్ తోట రమేష్, నిమ్మగడ్డ ప్రవీణ్, పూసల నరసింహారావు, సోషల్ మీడియా ఇన్చార్జ్ గుడివాడ శ్రీహరి, మూగల రమేష్, పిల్లలమర్రి వేణు, ముప్పారపు సందీప్, కొమరం ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు అండగా భరోసా సెంటర్




**భూపాలపల్లి, ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్):** బాధిత మహిళలు, బాలికలకు భరోసా సెంటర్ అండగా నిలుస్తుందని, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఎస్పి మాట్లాడారు. భరోసా కేంద్రం, హింస, లైంగిక బాధిత మహిళలకు, బాలికలకు వైద్యం, కౌన్సెలింగ్, లీగల్ ఇతర రకాల సేవలు అందిస్తుందని, బాధితులకు అండగా ఉంటూ మనోధైర్యం కల్పిస్తుందన్నారు. భరోసా కేంద్రం ద్వారా బాధిత మహిళలకు న్యాయం జరిగేలా కృషి చేస్తుందని పేర్కొన్నారు. భరోసా సహాయ కేంద్రాలు సమగ్రమైన సహాయాన్ని అందించడానికి, అలాగే హింసకు గురైన మహిళలకు పోలీస్‌స్టేషన్‌లకు, ఆసుపత్రులకు దూరంగా సురక్షితమైన వాతావరణంలో చేయూత అందించడానికి ఏర్పాటు చేయబడ్డాయన్నారు. హింస, లైంగిక వేధింపులకు గురైన పిల్లలు, స్త్రీలకు రక్షణ కల్పించడమే భరోసా కేంద్రాల లక్ష్యమన్నారు. లైంగిక వేధింపులకు గురైన బాధిత మహిళలకు, బాలికలకు సంబంధించిన కేసు పోలీసు స్టేషన్‌లో నమోదు కాబడిన సమయం నుంచి బాధితులకు అండగా ఉంటూ వారి మానసిక పరిస్థితి గురించి తెలుసుకుంటూ వారికి భరోసా కల్పిస్తూ, భరోసా సెంటర్ల గురించి అవగాహన కల్పిస్తున్న సిబ్బందిని ఎస్పీ కిరణ్ ఖరే గారు అభినందించారు. అలాగే భరోసా కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగినుల సమస్యలను ఎస్పీఅడిగి తెలుసుకున్నారు. భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్ పాల్గొన్నారు.

# గోర్ జాతి కోసం జీవితాన్ని త్యాగం చేసిన సద్గురు సేవాలాల్ మహారాజ్

- కిసాన్ పరివార్ ఆధ్వర్యంలో ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు
- సేవాలాల్ మహారాజ్ అడుగుజాడలో యువత నడుచుకోవాలి
- కిసాన్ పరివార్ సీఈఓ డాక్టర్ వివేక్



**డోర్నకల్ /మరిపెడ ఫిబ్రవరి 17(నినాదం న్యూస్ ):** గోర్ జాతిని అభివృద్ధి పథంలో ఏకతాటిపై నడిపించడానికి సేవాలాల్ మహారాజ్ జీవితాన్ని త్యాగం చేశారని కిసాన్ పరివార్ సీఈవో డాక్టర్ వివేక్ అన్నారు.మహబూబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని వావిలాల గ్రామ పరిధి బొట్టు మీద తండాలో సద్గురు సేవాలాల్ మహారాజ్ 286 వ జయంతి ఉత్సవాలను కిసాన్ పరివార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.. ముఖ్యఅతిథిగా సిఈఓ డాక్టర్ వివేక్ పాల్గొన్నారు.బంజారా నృత్య ప్రదర్శనతో ర్యాలీ నిర్వహించి భారీ డీజే చప్పుల నడుమ బంజారా అక్కల నృత్య ప్రదర్శనలో డాన్స్ చేస్తూ సీఈఓ డాక్టర్ వివేక్ కొత్త ఆనందాన్ని రేకెత్తించారు..భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొని సేవాలాల్ మహారాజ్ ను మొక్కుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించి,అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ గోర్ జాతి అభివృద్ధి కోసం సేవాలాల్ మహారాజ్ ఆ జన్మ బ్రహ్మచార్యుడిగా ఉండి అనేక ఉద్యమాలు చేశారన్నారు..జాతిని ఏకతాటిపై తీసుకోరావడానికి ఎంతో శ్రమించారని అలాంటి మహానుభావులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.లంబాడా జాతిలో పుట్టిన వారు ప్రతి ఒక్కరూ ఆ జాతిలో పుట్టడమే అదృష్టంగా భావించాలని గోర్ జాతి నుండి ఫలాలను తీసుకుని ఎదుగుతున్నారే తప్ప తిరిగి జాతి కోసం మనము ఎలాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్నామో ఆత్మను పరిశీలన చేసుకోవాలన్నారు.జాతి ఎదుగుదల కోసం సంపాదించిన సంపదలో ఒక శాతమైన కేటాయించాలన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో ఒక్కరికైనా అవకాశం కల్పించాలని యావత్ తెలంగాణ రాష్ట్రా లంబాడీలు ఎదురు చూస్తున్నారన్నారు.సద్గురు సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్రను తెలుగు పాఠ్య పుస్తకాలు ప్రచురింప చేసి నేటి యువతకు ఆదర్శంగా కలిగే విధంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ సి రాష్ట్ర అధ్యక్షులు బీమా నాయక్,సీనియర్ జర్నలిస్టు డివైగిరి,గోర్ శిక్వాడి హాట్య నాయక్,కిసాన్ పరివార్ మండల ఇంచార్జ్ లు విష్ణు నాయక్,శివ వర్మ నాయక్,రవి నాయక్,రామూర్తి,సోమన్న, మంగీలాల్ నాయక్, బిచ్చ చౌహాన్,హరి నాయక్,ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు వీరన్న నాయక్,విద్యార్థి సంఘం నాయకులు సూర్య ప్రకాష్, గ్రామ పెద్దలు ఇంకా తదితరులు పాల్గొన్నారు...

# ఉద్యమ పోరాట ఫలితమే ములుగు జిల్లా ఏర్పాటు



**ములుగు ప్రతినిధి, (నినాదం):** ఉద్యమ పోరాట ఫలితమే ములుగు జిల్లా ఏర్పాటైందని జిల్లా సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ముంజాల బిక్షపతి గౌడ్ అన్నారు. ములుగు జిల్లా ఏర్పడి ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఏడవ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ములుగు జిల్లా ఆవిర్భావ ఉత్సవాలను సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో విద్యార్థుల సమక్షంలో జరుపుకుంటూ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ములుగు జిల్లా ఉద్యమం మొదటగా విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రారంభమైందని, ఉద్యమానికి ప్రారంభంలో ఉపాధ్యాయులు లాయర్లు డాక్టర్లు విద్యార్థి సంఘాలు మొదటగా పాల్గొన్నారని ఆయన అన్నారు. జిల్లా ఉద్యమంలో అక్రమ అరెస్టులు కేసులు నిత్య నిర్బంధం ఎదుర్కొన్నామని, ఎన్నో అవమానాలు పడ్డా ధర్నాలు రాస్తారోకోలు అమరనా దీక్షలు సెల్ టవర్ ఎక్కడం పెట్రోల్ మీద పోసుకోవడం ఎన్నో ఉద్యమ పోరాటాలు చేసినట్లు ఆయన వివరించారు. మలిదశ ఉద్యమంలో రాజకీయ నాయకుల మద్దతుతో మేడారం సమ్మక్క సారక్క సన్నిధిలో రాజకీయ జేఏసీ ఏర్పాటు చేసి మరో తెలంగాణ ఉద్యమాన్ని నడిపించినట్లు ఆయన చెప్పారు. ములుగు జిల్లాతో పాటుగా మల్లంపల్లి మండలం పోరాట ఫలితంగా ఏర్పాటు అయ్యాయని, గిరిజన యూనివర్సిటీ మెడికల్ కళాశాల, మున్సిపాలిటీ, బస్సు డిపోలు సైతం పోరాట ఫలితంగానే వచ్చాయన్నారు. జిల్లా సాధన సమితి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి నూనె శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను జిల్లా ఉద్యమకారులను ఏ ప్రభుత్వం గుర్తించడం లేదని అన్నారు. ఉద్యమకారులను గుర్తించి నామినేట్ పోస్టులు ఇవ్వాలని ఆయన అన్నారు. వచ్చే స్థానిక ఎన్నికలలో కూడా తమకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు గుండ మీది వెంకటేశ్వర్లు, జిల్లా సానసమితి నాయకులు పల్లెర్ల సతీష్. మొగల్చర్ల రమేష్, కలువల సంజీవ, కాకి రవిపాల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# నిపుణులతో విద్యార్థులకు కంటి పరీక్షలు

- జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్



**భూపాలపల్లి, ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్):** నిపుణులతో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్ తెలిపారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఫిబ్రవరి 17 నుంచి 25 తేదీ వరకు 8 రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగనున్నట్లు తెలిపారు. 2024 ఆర్.బి.ఎస్.కె, టీం ద్వారా ఫేస్ 1, ఫేస్ 2 నందు 5నుండి 10 తరగతి చదువుతున్న విద్యార్థులకు కళ్ళు స్క్రీనింగ్ చేసి కంటి సమస్యలతో బాధపడుతున్నటువంటి పిల్లలు 750 మందిని గుర్తించడం జరిగినట్లు ఆయన తెలిపారు. రోజుకు 100 నుండి 150 మంది విద్యార్థులను జి జి హెచ్ డైక్ సెంటర్ కు తీసుకువెళ్లి మరోసారి పూర్తిస్థాయిలో నిపుణులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించి, అనంతరం వారి రిపోర్టులను రాష్ట్రస్థాయికి పంపించి అవసరమైన విద్యార్థులకు కంటి అద్దాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సోమవారం డైక్ సెంటర్ నందు 82 మంది విద్యార్థులకు ఆప్తమాలజిస్ట్ డాక్టర్ రాహుల్ కంటి పరీక్షలు నిర్వహించడం జరిగినదని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్ రాజ్ కుమార్, పిఓ డాక్టర్ ప్రమోద్ కుమార్, పారామెడికల్ ఆప్తాలమిస్టులు, ఆర్.బి.ఎస్.కె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సారథి మాజీ సీఎం కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



**డోర్నకల్/మరిపెడ ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర చరిత్రలో చిరకాలం నిలిచిపోయే నాయకుడు తెలంగాణ రాష్ట్ర సాధకుడు మాజీ సీఎం కేసీఆర్ కు కిసాన్ పరివార్ సీఈఓ డాక్టర్ వివేక్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు..తెలంగాణ రాష్టం మరింత అభివృద్ధి చెందాలంటే మాజీ సీఎం కేసీఆర్ మేధస్సు నైపుణ్యం ఎంతో అవసరం అన్నారు.రాష్ట్ర ప్రజల బాగోగుల కోసం ఎప్పటికీ కెసిఆర్ ఆరోగ్యం గా ఉండాలని ఆ దేవుని మనస్పూర్తిగా కోరుకుంటున్నా న్నారు.

## టిఎన్జివోస్ యూనియన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



**ములుగు ప్రతినిధి, (నినాదం న్యూస్):** టిఎన్జివోస్ యూనియన్ ఆధ్వర్యంలో ముద్రించిన టిఎన్జివోస్ యూనియన్ జిల్లా డైరీ, క్యాలెండర్ 2025ను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆవిష్కరించారు. సోమవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా అధ్యక్షులు పోలు రాజు అధ్యక్షతన ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా నాలుగవ తరగతి ఉద్యోగుల క్యాలెండర్, మహిళా విభాగం కాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో జిల్లా ఉద్యోగులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని, జిల్లా అభివృద్ధిలో వారి పాత్ర కృషి అమోఘమని కొనియాడారు. చిన్న స్థాయి ఉద్యోగి నుండి అధికారుల వరకు చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పని పనిచేస్తేనే సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతాయని అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో టీఎన్జీవోస్ యూనియన్ ముఖ్య భూమిక పోషిస్తుందని, ఉద్యోగులకు ఏ చిన్న సమస్య వచ్చినా సంఘం నాయకులు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మేడి చైతన్య, అసోసియేట్ అధ్యక్షులు భూక్య లాల్ నాయక్, కోశాధికారి ఏ కుమారస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు, మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు, నూతన కార్యవర్గ సభ్యులు, నాలుగు యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు, ఫోరం అధ్యక్ష కార్యదర్శులు నాలుగవ తరగతి, అంగన్వాడీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సాధకుడు మాజీ సీఎం కెసిఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

- మరిపెడ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పేషెంట్లకు పండ్లు పంపిణీ
- మరిపెడ బీఆర్ఎస్ నాయకులు



**డోర్నకల్ /మరిపెడ ఫిబ్రవరి 17(నినాదం న్యూస్ ):** తెలంగాణ రాష్ట్ర సాధకుడు తెలంగాణ ప్రజల చిరకాల కోరిక నెరవేర్చిన ప్రజా నాయకుడు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కోసం పదవులను సైతం లెక్క చేయకుండా రాజీనామాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మాజీ సీఎం తెలంగాణ రాష్ట్రానికే దిక్సూచిగా నిలిచిన నాయకుడు కెసిఆర్ జన్మదిన సందర్భంగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రాథమిక ప్రభుత్వ దావఖానలో బీఆర్ఎస్ నాయకులు పేషంట్లకు పండ్లలు,బ్రెడ్ ప్యాకెట్ పంపిణీ చేశారు.తెలంగాణ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించడానికి మాజీ సీఎం కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావాలని నిండు ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా దేవుని కోరుకున్నారు.. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంధసిరి కృష్ణ,అజ్మీరా రెడ్యా,ప్రవీణ్ నాయక్,భాస్కర్ నాయక్,కెసిఆర్ అభిమానులు ఇంకా తదితరులు పాల్గొన్నారు...

## ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

### -ప్రత్యేక హెూమం, పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**జమ్మికుంట, ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్):** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని, హుజురాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సుదర్శన హెూమం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ, సంప్రదాయ పూర్వకంగా హెూమం నిర్వహించగా, కేసీఆర్ గారు ఆయురారోగ్యాలతో, దీర్ఘాయుష్షుతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, "తెలంగాణ కోసం తన ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన మహానేత కేసీఆర్ గారి ఆశయాలు సుసంపన్నం కావాలని మనసారా కోరుకుంటున్నాం. ఆయన నేతృత్వంలో గడిచిన 10 ఏళ్లలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ, సంక్షేమాన్ని ప్రతి ఇంటికి అందించిన గొప్ప నాయకుడిగా కేసీఆర్ నిలిచారని తెలిపారు. తెలంగాణ ప్రజలు మరోసారి కేసీఆర్ నేతృత్వాన్ని కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పార్టీ తిరిగి అధికారంలోకి రావడం అనివార్యమని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.



## ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

### -కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టిన బీఆర్ఎస్ నేతలు

**జమ్మికుంట, ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్):** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కెసిఆర్ జన్మదిన పురస్కరించుకొని భారీ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు అనంతరం మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలలో తెలంగాణ అభివృద్ధి చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ ని ప్రజలు వారి మనసుల్లో ఆయనను పెట్టుకున్నారని తెలిపారు. కేసీఆర్ రైతాంగానికి రైతుబంధు ఇచ్చి రైతు బీమా కల్పించి మిషన్ భగీరథ మిషన్ కాకతీయ అనేక గొప్ప పథకాలను తెచ్చిన మహనీయుడు కెసిఆర్ అని తెలిపారు. రాబోయే రోజుల్లో మళ్లీ టిఆర్ఎస్ ప్రభుత్వం మే వస్తుందని మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ప్రజలు ఆయన రాక కోసం ఎదురుచూస్తున్నారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షులు టంగుటూరు రాజ్ కుమార్ సింగిల్ విండో చైర్మన్ పొన్నగంటి సంపత్, పార్లపల్లి రమేష్ ములుగు దిలీప్ మంద రాజేష్ కానిపర్తి లింగారావు దెయ్యాల శ్రీనివాస్ మహమ్మద్ జానీ పోడేటి రామస్వామి మాజీ సర్పంచులు మాజీ కౌన్సిలర్లు వార్డ్ అధ్యక్షులు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలపై పోరాడే శేఖర్ రావుకే మా మద్దతు

**కరీంనగర్, ఫిబ్రవరి,17(నినాదం న్యూస్ ):** రాష్ట్రంలోని బడ్జెట్ పాఠశాలల సమస్యలపై, ప్రైవేటు ఉపాధ్యా యుల సమస్యలపై పోరాడే పట్టభద్రుల ఎమ్మెల్సీ యాదగిరి శేఖర్ రావుకి తాము మద్దతు ఇస్తున్నట్లు కరీంనగర్ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు తెలిపారు. సోమవారం కరీం నగర్లో వారు విలేకరుల తో మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల యజమానులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో యాదగిరి శేఖర్ రావు ను బలపరుస్తున్నామని అన్నారు. గత 25 సంవత్సరాలుగా ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషి మేము మరువలేనిదని అన్నారు. అంతేకాకుండా మా పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల ప్రయోజనం కోసం కూడా ఆయన పోరాటం చేశారని అన్నారు. కరోనా విపత్కర సమయంలో ప్రతి పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడికి 25 కిలోల బియ్యం రెండు వేల రూపాయలను ప్రభుత్వం నుండి ఇప్పించిన ఘనత శేఖర్ రావుదేనని అన్నారు. ప్రవేట్ పాఠశాలల సంరక్షణ చట్టం, ఉపాధ్యాయుల కోసం హెల్త్ కార్డు, ఇన్సూరెన్స్ ఇప్పించడం కోసం గత కొంతకాలంగా ప్రభుత్వంతో పోరాటం చేస్తున్నారని అన్నారు. తమ సమస్యలపై పోరాడే వ్యక్తి కోసం తాము స్వచ్ఛందంగా ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేస్తున్నామని అన్నారు. 272 మండలాల్లో ఆయన పర్యటించి నిరుద్యోగ ఉపాధ్యాయుల సమస్యలపై పట్టబద్రుల సమస్యలపై ఎన్నో సమావేశాలు నిర్వహించి పరిష్కారం కోసం కృషి చేశారని అన్నారు.




## ఘనంగా కెసిఆర్ పుట్టినరోజు వేడుకలు

**కరీంనగర్, ఫిబ్రవరి 17(నినాదం న్యూస్ ):** .తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను నగరం లోని తెలంగాణ చౌక్ లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి కరీం నగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తో పాటు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షులు కాసారపు శ్రీనివాస్ గౌడ్, కొత్తపల్లి మాజీ మునిసిపల్ చైర్మన్ రుద్ర రాజు, కరీంనగర్ రూరల్ మండల పార్టీ అధ్యక్షులు పెండ్యాల శ్యామ్ సుందర్ రెడ్డి, పలువురు మాజీ కార్పొరేటర్లు, బిఆర్ఎస్ నగర మైనార్టీ శాఖ అధ్యక్షులు మీర్ షౌకత్ అలీ, పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలుకై పోరాడుతాం

### -గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి హరికృష్ణ

**కరీంనగర్, ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్ ):** న్యాయవాదుల పై దాడులను నివారించడమే లక్ష్యం గా అడ్వకేట్ ప్రొటెక్షన్ ఆక్ట్ అమలు కోసం పెద్దల సభలో పోరాడుతానని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి లైశెట్టి హరికృష్ణ తెలిపారు . సోమవారం కరీంనగర్ నగరం లోని కోర్ట్ బార్ హాల్ లో ఆయన న్యాయవాదుల ను కలిసి మద్దతు కోరారు .ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల పై దాడులను నివారించడానికి అడ్వకేట్ ప్రొటెక్షన్ ఆక్ట్ అమలు తో పాటు ,జూనియర్ న్యాయవాదుల కు స్టైఫండ్ , ఇన్సూరెన్స్ పరిమితి పెంపు ,ఇళ్ల స్థలాల కేటాయింపు వంటి ప్రధాన అంశాలపై పోరాడుతానని తెలిపారు. న్యాయవాదుల హక్కుల కోసం ప్రశ్నించేందుకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత వోట్ వేసి గెలిపించాలని కోరారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో ఊడుతుందో

- ఐఏఎస్ లను తప్పు చేయాలని ముఖ్యమంత్రే అంటారా
- రాష్ట్ర కేబినెట్ మంత్రుల్లో, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య చీలిక వచ్చింది
- కొందరు మంత్రులు ప్రతి పనికి 15 శాతం కమిషన్ దండుకుంటున్నారు
- కుల గణనతో కాంగ్రెస్ కొరివితో తలగోక్కొంటోంది
- మేధావులారా. కాంగ్రెస్ ను ఓడించండి. బీజేపిని గెలిపించండి
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, ఫిబ్రవరి 17(నినాదం న్యూస్ ):** రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే ప్రభుత్వం ఉంటుందో ఊడుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్ రెడ్డి ఒక్క తప్పు చేయాలని అంటే. ఐఏఎస్ లు మూడు తప్పులు చేస్తున్నారని వ్యాఖ్యానించడం సిగ్గు చేటన్నారు. సీఎంగా ఉంటూ అవినీతిని, తప్పులను నిరోధించాల్సింది పోయి తప్పులు చేయాలని చెప్పడమేంటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రే అవినీతి, తప్పులు జరుగుతున్నాయని ఒప్పుకున్నట్లయిందన్నారు. రాష్ట్రంలో మంత్రుల మధ్య, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య చీలిక వచ్చిందన్నారు. కొందరు మంత్రులు సొంత దుకాణాలు ఓపెన్ చేసి ప్రతి పనికి 15 శాతం చొప్పున కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతి నిరుద్యోగికి రూ.56 వేల నిరుద్యోగ భృతి, ప్రతి మహిళకు స్కూటీ, తులం బంగారం, ప్రతి ఉద్యోగికి పీఆర్సీ, 4 డీఏలు, రైతులకు రైతు భరోసా, బోనస్, రుణమాఫీ బాకీ పడిందని అన్నారు. కాంగ్రెస్ అంటేనే బాకీల సర్కార్ అని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బాకీల కాంగ్రెస్ సర్కార్ ను బండకేసి బాదాలని ప్రజలకు పిలుపునిచ్చారు. టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం కరీంనగర్ లోని కొండా సత్య లక్ష్మీ గార్డెన్ లో ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లాల్లోని బీజేపీ మండలాధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తోపాటు ఎంపీలు రఘునందన్ రావు, జి.నగేశ్, ఎమ్మెల్యేలు కాటేపల్లి వెంకటరమణారెడ్డి, పాయల శంకర్, పాల్వాయి హరీష్ బాబు మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి, బొడిగె శోభ, జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, బీజేపీ కొత్త మండలాధ్యక్షులుగా నియమితులైన తరువాత తొలిసారిగా ఎదురవుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీ దమ్ము చూపించండి. పీపుల్స్ పల్స్ సహా అనేక సర్వే సంస్థలు ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని స్పష్టం చేస్తున్నాయి. కాంగ్రెస్ కు అభ్యర్థులు దొరకక బయటనుండి అద్దెకు అభ్యర్థులను తెచ్చుకున్నాయి. బీఆర్ఎస్ అసలు పోటీలోనే లేదు. ఈసారి 3 ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ గెలవడం తథ్యం. ఎన్నికల ఫలితాల తరువాత నుండి మళ్లీ అధికారంలోకి వచ్చేదాకా రాష్ట్రంలో బీజేపీయే ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించ బోతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు ఒక్క బీజేపీకే ఉంది. నిరుద్యోగులు, టీచర్లు, ఉద్యోగుల పక్షాన నిరంతరం కొట్లాడి జైలుకు పోయింది మేమే. 317 జీవోపై దీక్ష చేస్తే నా ఆఫీస్ గేటును గ్యాస్ కట్టర్లతో కట్ చేయించి టియర్ గ్యాస్ వదిలి అద్దాలు పగలకొట్టి లాఠీఛార్జ్ చేయించారు. అద్దాలు కాలికి గుచ్చుకుని రక్తమోడుతున్నా కనికరం లేకుండా బరబరా గుంజుకుపోయి జైలుకు పంపారు. ముస్లింలను బీసీల్లో కలిపి అన్యాయం చేస్తున్నారు. కొందరు క్రైస్తవులు ఎస్సీ సర్టిఫికేట్లు తీసుకుంటూ ఎస్సీలకు నష్టం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా బీసీ, ఎస్సీ సంఘాలేం చేస్తున్నాయి ఎందుకు స్పందించడం లేదు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి కొమ్ముకాయడమే మీ పనా ఒక వర్గానికి కొమ్ముకాయాలని హిందూ సమాజానికి తీరని నష్టం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో మేధావులంతా గుణపాఠం చెప్పాలని కోరారు.

## ముస్తాక్ అలీ ముస్లింలకు క్షమాపణ చెప్పి ఓట్లు అడగాలి

**కరీంనగర్, ఫిబ్రవరి 17(నినాదం న్యూస్ )** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అబ్దుల్ రెహమాన్ ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ, ఇండిపెండెంట్ గ్రాడ్యుయేట్ ఏం.ఎల్.సి అభ్యర్థిగా పోటీచేస్తున్న మహమ్మద్ ముస్తాక్ అలీ తన ఎన్నికల అఫిడవిట్ లో మొహమ్మద్ ముస్తాక్ అని చూపెట్టుకున్నారు కానీ కొన్ని నెలల క్రితం వరకు ఫేస్బుక్లో , సోషల్ మీడియా లో మాత్రం ముస్తాక్ అలీ ఖాన్ అని చెప్పుకొన్నారు.. ప్రస్తుతం ఎన్నికల ప్రచారానికి సంబంధించిన పాంప్లెంట్లలో, ఫ్లెక్సీ లలో డాక్టర్ ముస్తాక్ అలీ పీహెచ్డీ అని చూపెట్టుకుంటున్నాడు .ఇది ఇలా ఉంటే తన పీహెచ్డీ డాక్టరేట్ సంబంధించిన వివరములు గ్రాడ్యుయేట్ ఏం.ఎల్.సి అభ్యర్థిగా తాను వేసిన నామినేషన్ లో మాత్రం పేర్కొనలేదు. ఆయనకు అసలు పిహెచ్డి డిగ్రీ ఉందా లేక అది ఫేక్ ముచ్చటానా .లేకపోతే మైనారిటీ లను మభ్య పెట్టడానికి అలా అబద్ధపు ప్రచారాలు చేసుకొంటున్నారా అనే దానిని గ్రాడ్యుయేట్స్ ఒక సారి ఆలోచన చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ముస్తాక్ అలీ బిజెపి కు కోవర్టు గా ఉన్నట్టు మనకు కనిపిస్తుంది. మైనార్టీ ఓట్లను చీల్చి చేసి బిజెపి అభ్యర్థిని సపోర్ట్ చేయడానికి, సెక్యులర్ పార్టీ అయిన కాంగ్రెస్ బల పరచిన అభ్యర్థిని ఓడించడానికి ప్రయత్నం చేస్తున్నట్టు మాకు అనుమానములు ఉన్నాయి. ఎందుకంటే ఆయన ఎన్నికల ప్రచార సాధనాల్లో తన పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకొని మరి తాను ప్రచారం చేసుకొంటున్నారు, ఒక వేళ అలా పెట్టుకోవాలంటే పీహెచ్డీ చేసి ఉండాలి.మైనారిటీ లకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కావాలంటే కేవలం ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి తోనే సాధ్యం కాబట్టి మీరందరూ అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కి మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత తో కూడిన ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని నేను మైనారిటీ గ్రాడ్యుయేట్స్ ని విజ్ఞప్తి చేస్తున్నా ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహమ్మద్ అమీర్ అలాగే ఈ కాంగ్రెస్ మాజీ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఖలీం యూత్ కాంగ్రెస్ డిస్టిక్ జనరల్ సెక్రెటరీ మీరజా అతిఫ్ బైగా,డిస్టిక్ కాంగ్రెస్ మైనారిటీ సెల్ వైస్ ప్రెసిడెంట్ మొహ్మమెడీ జమీల్ మరియు నాయకులు పాల్గొన్నారు.




## మహిళల ఆరోగ్యం-కుటుంబానికి రక్ష

**జమ్మికుంట, ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్):** గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్ ) అరుణోదయ మండల సమాఖ్య కార్యాలయంలో మహిళాలకు ఆహారం, ఆరోగ్యం, అనే అంశాలపై శిక్షణ అవగాహన కార్యక్రమం మండల సమాఖ్య జమ్మికుంట ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ అరోగ్య అవగాహన కార్యక్రమాల్లో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యూకెటర్ మోహన్ రెడ్డి పాల్గొని , వివిధ గ్రామాలనుండి వచ్చినా మహిళ సంఘాల మహిళ అధ్యక్షులకు అరోగ్య మహిళ కార్యక్రమంపై అవగాహణ కల్పించారు . మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబానికి రక్ష అని హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి అన్నారు. కుటుంబంలో మహిళల పాత్ర ముఖ్యమని, వారు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులూ ఉండవని అన్నారు.అరోగ్య మహిళా కార్యక్రమమును ప్రతి మహిళా వినియోగించుకొని అరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా లబ్ధి పొందాలన్నారు. ప్రతి మంగళవారం మరియు గురువారం మహిళలకు ఉచితముగా అరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అరోగ్య పరిరక్షణ పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. పోషకాహారం గురించి ,వ్యక్తిగత పరిశుభ్రత గురించి, రక్త హీనతగురించి, చేతుల పరిశుభ్రత గురించి మహిళలకు అవగాహణ కల్పించారు, మహిళల ఆరోగ్యం కోసం ప్రతి గ్రామం లో అరోగ్య కార్యక్రమాలు చేపడుతున్నాం అన్నారు. టీ బి ముక్త్ పోగ్రంలో బాగంగా టిబి సూపర్ వైజర్ దేవేందర్ రెడ్డి టీబీ వ్యాధి పై అవగాహణ కల్పించారు.ఇట్టి కార్యక్రమం లో ఏపీఎం శ్రీనివాస్,హెల్త్ ఎడ్యూకేటర్ మోహన్ రెడ్డి హెల్త్ సూపర్ వైజర్స్ రత్నకుమారి ,దేవేందర్ రెడ్డి, తిరుపతి ,సీసీ లు మొగిలి సురేష్ సరిత, శ్రీనివాస్, రాజేందర్, మండలసమాఖ్య అధక్షురాలు శృతి, కార్యదర్శి రజిత కోశాధికారి భవాని, మండల సమాఖ్య సిబ్బంది అనూష, శ్రీనివాస్, సుమలత, పలు గ్రామాల గ్రామైక్య సంఘ అధ్యక్షులు, హెల్త్ కమిటీ మెంబెర్స్ పాల్గొన్నారు.



## పన్నుల వసూళ్లలో రాష్ట్ర స్థాయి మొదటి స్థానంలో జమ్మికుంట

- అందరి సహకారంతోనే ఇది సాధ్యం
- మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ అయాజ్

**జమ్మికుంట, ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్):** రాష్ట్రంలో మున్సిపాలిటీల ఆస్తి పన్నులలో రాష్ట్ర స్థాయిలో మొదటి వరుస సాధించి, నిలకడగా మొదటి స్థానాన్ని ఉంచేందుకు సహకరిస్తున్న ప్రజా ప్రతినిధులకు, పాత్రికేయ మిత్రులకు, మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు మున్సిపల్ కమిషనర్ ముహమ్మద్ అయాజ్ ధన్యవాదాలు తెలిపారు. సోమవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో ఆస్తి పన్ను వసూళ్లలో స్వయంగా మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ అయాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మొహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి చెందిన పన్నుల వసూళ్లలో రాష్ట్రంలో ముందు వరుస స్థానాన్ని నిలకడ ఉంచుతున్నామని ఆయన అన్నారు. జమ్మికుంట మున్సిపాలిటీలో ఇంకా పన్నులు చెల్లించె వారు ఉన్నారని ఈ నెల చివరి వరకు పూర్తిస్థాయిలో పన్నుల వసూళ్లు చేయాలని కమిషనర్ ఆయాజ్ అన్నారు.డిమాండ్ 315.50 లక్షలు, వసులు 258.70 లక్షలు , 82% ఈరోజు వరకు వసులు ఆయనవి. మార్చ్ నెల చివరి వరకు వంద శాతం వసులు చేయాలని తెలిపారు. పన్నుల వసూళ్లకు సహకరిస్తున్న తాజా మాజీ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, పాలక వర్గానికి, మున్సిపల్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, రెవెన్యూ ఇన్ స్పెక్టర్, భాస్కర్, వార్డు ఆఫీసర్లు, వాణి, సిస, బిల్ కలెక్టర్లు పలువురు పాల్గొన్నారు.



## మల్యాలలో కెసిఆర్ జన్మదిన వేడుకలు

**మల్యాల, ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్):** భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించి తెలంగాణ రాష్ట్రం సాధించిన తొలి ముఖ్య మంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం బ్లాక్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ముందు కేక్ కట్ చేసి హాస్పిటల్లో రోగులకు పంపిణీ చేశారు .ఈ సందర్భంగా చెట్లను నాటి కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ,పార్టీ అధ్యక్షుడు జనగం శ్రీనివాస్ ,సింగిల్ విండో చైర్మన్లు సాగర్ రావు ,మధుసూదన్ రావు ,మాజీ సర్పంచులు తిరుపతి రెడ్డి, రవివర్మ ,కుమారస్వామి, తిరుపతిరెడ్డి, నాయకులు తిరుపతి గౌడ్ , అనిల్ రెడ్డి, మల్లారెడ్డి, దేవరాజం, రాజేశ్వర్ రెడ్డి గుడిసె రవి ,చిన్న దుర్గయ్య, నరసయ్య బాలే సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



## మల్కా కొమరయ్యకు బీసీ సంఘాల మద్దతు



**కరీంనగర్, ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్):** బిజెపి టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమరయ్యకు పెరుగుతున్న టీచర్స్ సంఘాల మద్దతు తాజాగా బీసీ సంఘాల మద్దతు కూడా తోడైంది బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఈరోజు కరీంనగర్ ప్రెస్ క్లబ్ లో మాట్లాడుతూ.. బీసీ ముద్దు బిడ్డ అయిన మల్క కొమురయ్యను ఈసారి గెలిపించుకుంటే ఇది 2028 ఎన్నికలకు సెమీఫైనల్ అని మల్కా కొమురయ్య ఒక్కడు గెలిస్తే బీసీల అందరు గెలిచినట్టే అని అన్నారు. కచ్చితంగా బీసీ ఉపాధ్యాయులందరూ రాజకీయాలకు సంఘాలకు అతీతంగా బీసీ వాదాన్ని నిలబెట్టాలంటే బీసీ అభ్యర్థి అయిన మల్కా కొమురయ్యను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. మచ్చలేని మనిషి మల్లె పువ్వు లాంటి మనసున్న మన కొమరన్నను గెలిపించుకొని చట్టసభలకు పంపిస్తే బీసీ వాదాన్ని బలంగా వినిపించిన వాళ్లమవుతామని తద్వారా బీసీ రాజ్యాధికారం సాధ్యమవుతుందని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కరీంనగర్ నుండి మొదలుపెట్టిన బీసీ యాత్ర ఉమ్మడి జిల్లాలో తిరుగుతూ బీసీ ఉపాధ్యాయుల చైతన్య పరుస్తూ తమ యాత్ర ఉంటుందని మీడియాకు తెలిపారు.

## న్యాయవాదుల మద్దతు కోరిన ఏమ్మెల్సీ అభ్యర్థి ప్రొఫెసర్ చెన్న కృష్ణారెడ్డి



**కరీంనగర్, ఫిబ్రవరి 17(నినాదం న్యూస్ ):** ఎమ్మెల్సీ ప్రచారంలో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని కోర్టు కాంప్లెక్స్ ల లాయర్లను పలు మండలాల్లో ని పాఠశాలలు ,కళాశాలలు ,గ్రామాలు సందర్శించి గ్రాడ్యుయేట్ ఓటర్స్ ని కలిసి తనకు మద్దతును తెలపాలని మన తెలంగాణ యువ శక్తి ఏమ్మెల్సీ అభ్యర్థి ప్రొఫెసర్ చెన్న కృష్ణారెడ్డి కోరారు.అనంతరం మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో విజయవంతంగా పోరాడే నాయకుడు కావాలని అందుకే పట్టభద్రుల తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా ముందుకు వస్తున్నానని తనను బలపరిచి సీరియల్ 27 కి తమ ఓటు వేసి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేత

**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి,ఫిబ్రవరి17 (నినాదం న్యూస్):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా విద్యుత్ కౌటాల విద్యుత్ సెక్షన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు కౌటాల సెక్షన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రాజేశ్వర్ తెలిపారు. కొత్తగా 132 కెవీ విద్యుత్తు లైను నిర్మాణంలో ఉన్నందువల్ల ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు 33 కెవీ రవీంద్ర నగర్ ఫీడర్ మీద విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు. దీంతో 11 కేవీ అనుకోడా మరియు 11 కేవీ చీపురుదుబ్బ ఫీడర్ మీద లైన్ క్లియర్ చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ోయయాపల్గూడ,యాపలగూడ, నాగేపల్లి, గురుడ్ పేట, కన్నేపల్లి, కనికి, బోదంపల్లి, రవీంద్రనగర్, బాబాపూర్, గంగాపూర్, బాబాసాగర్, చింతలమానెపల్లి, రుద్రాపూర్, కర్జవెల్లి, ముంజంపల్లి, బారెగూడ, పోతేపల్లి మరియు కాటేపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.



# వందల వ్యాధులకు ఒకటే మందు

# మునగాకు

## ఒక చెంచా మునగాకు పొడితో ఇన్ని లాభాలా

పూర్వకాలం నుంచి మునగాకును మన ఆహారాల్లో భాగంగా తీసుకునే అలవాటు ఉంది. ముఖ్యంగా తెలుగువారు ఆచారాల పేరుతో ఆషాఢ మాసంలో దీన్ని ఎక్కువగా తినేందుకు ఆసక్తి చూపిస్తారు. మిగిలిన కాలాల్లో దీన్ని తినేందుకు పెద్దగా శ్రద్ధ చూపించరు. మునగాకు ఎన్నో జబ్బులను తగ్గించే సంజీవనిగా ఆయుర్వేద శాస్త్రం చెబుతోంది. మనకు దొరికే అన్ని ఆకు కూరల్లో కంటే దీనిలో పోషకాలు మెండుగా ఉంటాయి. అందుకనే దీన్ని దొరికినంత కాలం చక్కగా వారానికి ఒకసారైనా తినేందుకు ప్రయత్నించాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల మనకు వచ్చే అవకాశాలున్న రోగాలు కూడా 90 శాతం వరకు తగ్గుముఖం పడతాయని అంటున్నారు.

మునగాకు పొడిని మొరింగా పౌడర్ అని కూడా పిలుస్తారు. మునగ చెట్టు ఆకు నుంచి ఆకులను సేకరించి ఎండబెట్టి పొడిగా మారుస్తారు. దీనిని వివిధ ఆహారాలు, ఔషధాలు, జుట్టు, చర్మ సంరక్షణ ప్రొడక్ట్స్ లోనూ ఉపయోగిస్తారు. దీనిని రోజు మీ డైట్ లో చేర్చుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. విటమిన్లు ఎ, సి, బి-కాంప్లెక్స్, కాల్షియం, ఐరన్, పొటాషియం, జింక్, మెగ్నీషియం, రాగి, ఫోలిక్ ఆమ్లం, పిరిడాక్సిన్, నికోటినిక్ ఆమ్లం వంటి పోషకాలు అధిక మొత్తంలో ఉంటాయి.

### మీకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఇవే..

- రక్తపోటును, మధుమేహాన్ని కంట్రోల్ చేస్తుంది.
- బరువు తగ్గించడంలో సహాయపడుతుంది.
- ఎముకలను, దంతాలను బలంగా మార్చుతుంది.
- హార్మోన్ అసమతుల్యత ఉన్నవారిలో వీటిని బ్యాలన్స్ చేస్తుంది.
- రోగనిరోధక శక్తిని పెంచుకోవాలనుకునే వారికి ఇది బెస్ట్ ఆప్షన్.
- గుండె సంబంధిత అనారోగ్యాల నుంచి కాపాడుతుంది.
- జుట్టు రాలడం, ఉబ్బసం, కీళ్ల నొప్పులు వంటి సమస్యల నుంచి బయటపడేస్తుంది.

### మునగాకు పొడి తయారీ...

మునగాకును కొమ్మలతో సహా సేకరించి, మంచి నీటితో శుభ్రం చేసి నీడలో అరబెట్టాలి. ఎండలో అరబేడితే కొన్ని పోషకాలు విటమిన్ లు నశించిపోతాయి. 4-6 రోజుల్లో ఇవి ఎండిపోతాయి.10కిలోల తాజా ఆకులనుంచి ఒక కిలో ఎండిపోయిన పొడి వస్తుంది. తయారు చేసిన పోడిని ఓవన్లలో 50డి. సె. గ్రే. వద్ద ఉంచి అందులో తేమను తగ్గించాలి. దేన్నీ గాలి చొరని డబ్బాల్లో పోసి వేడి, వెలుతురు, తేమ లేని ప్రదేశాల్లో నిల్వ ఉంచాలి. 6-12 నేలాల వరకు ఈ పోడిని నిల్వ చేసుకోవచ్చు. తాజామునగాకుల్లో కన్నా పోడిలో ఎక్కువ పోషకాలు ఉంటాయి. ఈ పోడిని చపాతీలు, ఇడ్లీ, దోస, సపుల్లో, సలాడ్లలో కలిపి తీసుకోవచ్చు. దీనితో ఒకరాక మైయినా టీ కూడా తయారు చేస్తారు. ఔషదంగా పని చేస్తుంది. పోషకలోపాలతో బాధపడుతున్న చిన్న పిల్లలకు మంచిది. రక్తహీనత తగ్గిచడం లో, బాలింతలు పాలు ఎక్కువగా రావడానికి ఇస్తారు. ఇళ్లలో ఈ పొడి తయారు చేసి వాడుకోవచ్చు. రోజుకు 1-2 చెంచాలు పొడి తీసుకోవచ్చు. మార్కెట్లో పొడి గా గోళీలా రూపంలో లభిస్తుంది. ఒక గ్రాము మునగాకు పొడిలో పాల కూర కన్నా 25రేట్లు ఎక్కువ ఇనుము, 3రేట్లు అధిక విటమిన్ ఇ ఉంటుంది. అలాగే అరటి పండులో కన్నా 15 రేట్లు పొటషియం , పాలలో కన్నా 12 రేట్లు కాలిష్యం, క్యారెట్ లో కన్నా 10 రేట్లు విటమిన్ A గుడ్లలో కన్నా 9రేట్లు మాంసకృత్తులు, బత్తాయిలో కన్నా 7 రేట్లు విటమిన్ సి అధికంగా ఉంటాయి.

### మునగాకును ఆహారంలో ఎలా చేర్చుకోవచ్చు?

తాజా మునగాకు దొరికే సీజన్ లో నేరుగా కూరలు వండుకోవచ్చు. సాంబర్ లో వేసుకోవచ్చు. మునగాకుతో పచ్చడి చేసుకోవచ్చు. సీజన్ కానప్పుడు.. ముందుగానే ఆకును ఎండబెట్టుకోవాలి. ఆకును ఎండలో కాకుండా నీడలోనే గాలితో ఆరేలా చూసుకోవాలి. తడి ఆరాక ఈ ఆకులను పొడి చేసుకుని గానీ, లేదంటే అలాగే గాలి చొరవని డబ్బాలో భద్రపరుచుకోవాలి. ఈ పొడిని కూడా సాంబార్, కూరల్లో వేసుకోవచ్చు. ఉదయం తాగే స్మూతీల్లో వేసుకోవచ్చు. సూప్స్, సలాడ్లలో పొడి చల్లుకోవచ్చు. కుకీలు చేసే పిండిలో వేయొచ్చు. వేడి నీటిలో ఈ పొడిని మరిగించి కాస్త పంచదార వేసుకుని టీ లాగా తాగేయొచ్చు.మునగాకు లాభాలు:ఎముకల అరుగుదల ఉన్న వారికి:కాల్షియం లోపం ఉన్న వారు మునగాకును ఎక్కువగా తినేందుకు ప్రయత్నించాలి. ఎముకల అరుగుదల, ఎముకల బలహీనత, కీళ్ల నొప్పులు

ఉన్న వారికి ఇది చక్కగా ఉపకరిస్తుంది. పాలలో కంటే 17 రెట్లు ఎక్కువగా కాల్షియం ఇందులో ఉంటుంది. అలాగే పెరుగులో కంటే ఎనిమిది రెట్లు ఎక్కువ ప్రొటీన్ ఉంటుంది. ఇంకా అరటిపండులో కంటే 15 రెట్లు ఎక్కువ పొటాషియం ఇందులో లభిస్తుంది. ఎదిగే పిల్లలకు మునగాకు రసాన్ని పాలల్లో కలిపి తాగించడం వల్ల ఎముకలు దృఢంగా మారతాయి.



**క్యాన్సర్లకు చెక్...** మునగాకులో యాంటీ క్యాన్సర్ లక్షణాలు ఉన్నాయి. అందుకనే ఇది కొన్ని రకాల క్యాన్సర్లను రానీయకుండా చేస్తుంది. ఇది కొన్ని క్యాన్సర్ కణాలను సమర్థవంతంగా చంపివేస్తున్నట్లు పరిశోధనల్లో తేలింది.



**జీర్ణ శక్తికి :** కొందరికి తిన్న ఆహారం సరిగ్గా ఒంటపట్టదు. అరుగుదల సమస్యలు ఉంటాయి. ఇలా అజీర్ణం, మూత్ర విసర్జనలో మంట, మలబద్ధకం, మూత్ర పిండాల వ్యాధులు.. తదితరాలు ఉన్న వారు వీటిని వాడుకోవచ్చు. ఒక గ్లాసు క్యారెట్ జ్యూస్ ఒక చెంచా మునగాకు రసం కలుపుకుని తాగడం వల్ల ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.



**చర్మ వ్యాధులకు :** నువ్వుల నూనెలో మునగాకు రసాన్ని పోసి మరగనివ్వాలి. దీన్ని గజ్జి, తామర, దురదలాంటి వాటికి పైపూత మందులా వాడుకోవచ్చు.



**ఆస్తమా, టీబీలకు ఔషధం:** ఓ గ్లాసుడు నీళ్లలో గుప్పెడు మునగాకుల్ని వేసి మరగనివ్వాలి. వాటిని వడగట్టి ఉప్పు, మిరియాల పొడి, నిమ్మరసం చేర్చి కలపాలి. ఈ నీటిని తాగడం వల్ల ఆస్తమా, టీబీ, దగ్గు తగ్గుముఖం పడతాయి. ఇంతే కాదండీ శరీరంలో ప్రతి అవయవానికి వచ్చే ఇబ్బందికీ ఇది పరిష్కారం చూపుతుంది. అందుకనే కనీసం వారానికి ఒక సారైనా దీన్ని తప్పకుండా తినాలి




ఖరీదైన డైట్ లు, ప్రొటీన్ షేక్ లు, డ్రైఫ్రూట్స్ తీసుకోలేకపోయినా పరవాలేదు. మీ శరీరాన్ని పవర్ హౌస్ లా మార్చుకునేందుకు మీ ఆర్థిక స్థితి ఏమాత్రం అడ్డంకి కాదు. అలాంటి ఓ సూపర్ ఫుడ్ గురించే ఇప్పుడు తెలుసుకుందాం. ఒకే ఒక్క చెంచా మునగాకు పొడి మీ శరీరంలో అద్భుతాలు చేయగలదని మీకు తెలుసా?..

**మునగాకు కారంతో ఓ ముద్ద..**

మునగాకు పొడిని రోజూ ఆహారంలో తీసుకోవచ్చు. కొందరు దీనితో కారం పొడి తయారు చేస్తుంటారు. మొదటి ముద్దలో ఒక చెంచా కారం పొడి వేసుకుని తినడం వల్ల బాడీ తొందరగా వీటిలోని పోషకాలను గ్రహిస్తుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారికి ఇది రామబాణంలో పనిచేస్తుంది.

**డీటాక్సిఫికేషన్ డ్రింక్ లా..**

మునగాకు పొడితో తయారు చేసే టీని మొరింగా టీగా మార్కెట్లో అమ్ముతుంటారు. బాడీని డీటాక్సిఫై చేసుకునేందుకు ఇది బాగా పనిచేస్తుంది. వేడి నీటిలో చెంచా పొడిని వేసుకుని టీలా తయారు చేసుకోవాలి. అవసరమైతే నిమ్మచెక్క పిండుకోవాలి. ఇధి టాక్సిన్స్ ను బయటకు తోస్తుంది. తినగానే పొట్ట ఉబ్బినట్టుగా ఉన్నా, లివర్ సమస్యలు ఉన్నా ఈ టీ మంచి రెమిడీ. దీనిని కాస్త చల్లార్చి తేనె కూడా కలుపుకుంటే ఇంకా రుచిగా ఉంటుంది.

**మునగాకు నూనెతో ఎన్నో లాభాలు..**

మీ చర్మ సమస్యలను చిటికెలో దూరం చేసే శక్తి మునగాకుకు ఉంది. దీనిని నూనెలా తయారు చేసుకుని చర్మానికి రాసుకోవచ్చు. ఇందులో ఉండే విటమిన్ ఎ, సి, ఇ వంటివి వయసును తగ్గించి మచ్చలు, ముడతలను కనపడకుండ చేస్తాయి. రోజూ కొనని చుక్కల మొరింగా నూనెను ముఖం, చేతులు, ఇతర భాగాలకు పట్టించుకోవాలి. ఇది చర్మంలోని ఇన్ ఫ్లమేషన్ ను కూడా తగ్గిస్తుంది.

**సప్లిమెంట్స్ రూపంలోనూ..**

మునగాకు పొడిని నేరుగా తీసుకునేందుకు ఇష్టపడని వారు వీటిని ట్యాబ్లెట్స్ రూపంలో తీసుకోవచ్చు. ఇవి మీ ఎనర్జీ లెవెల్స్ ను చక్కగా మెయింటైన్ చేస్తుంది.

## మార్కెట్

### భారత్‌లో భారీగా తగ్గిన చక్కెర ఉత్పత్తి..!



భారత్‌లో ప్రస్తుత సీజన్‌లో చక్కెర ఉత్పత్తి భారీ తగ్గింది. మొత్తం ఉత్పత్తి 27 మిలియన్ మెట్రిక్ టన్నుల కంటే తక్కువగా ఉంటుందని అంచనా. గత సంవత్సరం 31.8 మిలియన్ మెట్రిక్ టన్నుల కంటే గణనీయంగా తగ్గింది. ఈ విషయాన్ని సెంట్రమ్ నివేదికలో పేర్కొంది. ఫిబ్రవరి 15, 2025 నాటికి దేశంలో చక్కెర ఉత్పత్తి 19.77 ఎంఎంటీ కాగా.. గత సీజన్ ఇదే సమయానికి కంటే 12శాతం తక్కువ. చక్కెర ఉత్పత్తి తగ్గుదలకు ప్రధాన కారణం ఇథనాల్ ఉత్పత్తికి ఎక్కువగా చెరకును ఉపయోగించడం కారణంగా.. చక్కెర ఉత్పత్తికి కొరత ఏర్పడింది. నివేదిక ప్రకారం.. రాష్ట్రాల వారీగా చక్కెర ఉత్పత్తిని పరిశీలిస్తే.. మహారాష్ట్రలో భారీగా ఉత్పత్తి తగ్గింది. ఏకంగా 14శాతం ఉత్పత్తి పడిపోయింది. కర్ణాటకలో 13శాతం, ఉత్తరప్రదేశ్‌లో 8శాతం తగ్గుదల నమోదైంది. గతపక్షం రోజుల్లో కర్ణాటకలో చెరకు లభ్యత 22శాతం తగ్గింది. మహారాష్ట్రలో చెరకు లభ్యత గత సంవత్సరంతో పోలిస్తే 7.8 శాతం తగ్గింది. అయితే, ప్రస్తుత సీజన్‌లో యూపీలో చెరకు లభ్యత 1.4 శాతం పెరుగుదలతో స్థిరంగానే ఉన్నది. చెరకు సరఫరా తగ్గడంతో అనేక మిల్లులు ఊహించిన సమయం కంటే ముందుగానే క్రషింగ్ కార్యాకలాపాలను నిలిపివేశాయి. జనవరి 31 నాటికి 23 మిల్లులు క్రషింగ్‌ను ఆపగా.. ఫిబ్రవరి 15 నాటికి ఈ సంఖ్య 51కి చేరింది. ప్రస్తుత సీజన్‌లో చెరకు క్రషింగ్ 4.5శాతం తగ్గి 218 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకుంది. గత సీజన్‌లో 228 ఎంఎంటీలుగా ఉన్నది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బియ్యం ధరల పెంపును ఉపసంహరించుకుంది. కిలోకు రూ.22.5గా నిర్ణయించింది. మరో వైపు కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ ధరలను మార్చడంతో వ్యాపారులు నిరాశకు గురయ్యారు. ఎందుకంటే బీ-హెచ్‌వీ (BH), ప్రత్యక్ష ఇథనాల్ ఉత్పత్తిలో విస్తృత పెరుగుదల అంచనాలకు విరుద్ధంగా.. సీ-హెవీ (CH) మార్గంలో మాత్రమే 3 శాతం ధర పెరుగుదల కనిపించింది. పరిశ్రమ నిపుణుల సూచనల ప్రకారం.. మిల్లులు సీహెచ్ ఆధారిత ఇథనాల్ ఉత్పత్తిపై దృష్టి సారించేందుకు అవకాశం ఉంటుంది. ఫలితంగా చక్కెర ఉత్పత్తి పెరిగి.. ఇథనాల్ ఉత్పత్తి తగ్గుతుంది. ఉత్పత్తి తగ్గినప్పటికీ చక్కెర ధరలు స్థిరంగా, లాభదాయకంగా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో చక్కెర ధరలు టన్నుకు రూ.41వేలు ఉండా.. మహారాష్ట్రలో టన్నుకు రూ.37,500 కంటే ఎక్కువగా ఉన్నది. ప్రభుత్వం ఇటీవల ఒక ఎంఎంటీ చక్కెర కోటా ఎగుమతికి ఆమోదించిన నేపథ్యంలో వచ్చే ఏడాది దేశీయంగా ధరలు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.




దేశీయ స్టాక్ మార్కెట్లు ఎనిమిది రోజుల నష్టాలకు ఎట్టకేలకు బ్రేక్ పడింది. సోమవారం సెషన్‌లో మార్కెట్లు స్వల్ప లాభాల్లో ముగిశాయి. ఫార్మా, మెటల్, ఫైనాన్షియల్ రంగాల్లో మద్దతుతో సూచీలు లాభపడ్డాయి. గ్లోబల్ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల మధ్య సూచీలు ఉదయం బలహీనంగా ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత కొద్దిసేపటికే అమ్మకాల ఒత్తిడికి గురయ్యారు. పెరుగుతూ.. పడిపోతూ.. ఒడిదొడుకులను ఎదుర్కొన్నాయి. చివరకు స్వల్ప లాభాలతో బయటపడ్డాయి. సెన్సెక్స్ క్రితం సెషన్‌తో పోలిస్తే.. సోమవారం ఉదయం 75,641.41 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలయ్యాయి. ఇంట్రాడేలో 75,294.76 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 76,041.96 పాయింట్లకు పెరిగింది. చివరకు 57.65 పాయింట్ల లాభంతో 75,996.86 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 30.25 పాయింట్లు పెరిగి.. 22,959.50 వద్ద ముగిసింది.

నిఫ్టీలో బజాజ్ ఫిన్‌సర్వ్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, పవర్ గ్రిడ్ కార్ప్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్ లాభాలను ఆర్జించాయి. ఎం అండ్ ఎం, భారతి ఎయిర్‌టెల్, విప్రో, టీసీఎస్, ఇన్ఫోసిస్ నష్టపోయాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం పెరగ్గా.. స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.6శాతం పడిపోయింది. ఆటో, ఐటీ, టెలికాం, మీడియా 0.5శాతం నుంచి ఒకశాతం వరకు పతనమయ్యాయి. ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్, ఎనర్జీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్ సూచీలు 0.5-1 శాతం పెరిగాయి. ఎన్‌టీపీసీ, టాటా మోటార్స్, పవర్ గ్రిడ్, ఎస్‌బీఐ, హీరో మోటోకార్ప్, కోల్ ఇండియా, తాన్లా ప్లాట్‌ఫామ్స్, కిర్లోస్కర్ ఆయిల్, డేటా ప్యాటర్న్స్, కార్బోరండం, ఈఐహెచ్, రిలాక్సో ఫుట్‌వేర్, టాటా టెలిసర్వీసెస్, పీఎన్‌సీ ఇన్‌ఫ్రాటెక్, జ్యోతి ల్యాబ్స్, అనుపమ్ రసాయనన్, టిటాగర్ రైల్, థర్మాక్స్, ఎన్ఎండీసీ స్టీల్, షాపర్స్ స్టాప్, బాలాజీ అమైన్స్, గ్రాఫైట్ ఇండియా సహా 900 కంటే ఎక్కువ స్టాక్‌లు బీఎస్‌ఇలో 52 వారాల కనిష్ఠానికి చేరుకున్నాయి.

## మారిన ఫాస్ట్ ట్యాగ్ నియమాలు : పొరపాట్లు చేస్తే రెట్టింపు టోల్

ఫాస్ట్‌ట్యాగ్ ఉపయోగించి టోల్ దాటే డ్రైవర్లకు సోమవారం నుండి నిబంధనలలో మార్పు చేసింది ప్రభుత్వం. టోల్ ప్లాజాల వద్ద రద్దీ, జాప్యాలను తగ్గించడానికి, ప్రయాణాన్ని వేగవంతం చేయడానికి రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ఈ వ్యవస్థను అమలు చేసింది. సోమవారం నుండి అమల్లోకి వచ్చిన నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఫాస్టాగ్ నిబంధనలలో మార్పులు చేసింది. ఈ మార్పుల లక్ష్యం టోల్ వసూలును సులభతరం చేయడం, హైవేపై వాహనాల కదలికను ఎటువంటి అంతరాయం లేకుండా సజావుగా నిర్వహించడం. నిబంధనలలో మార్పులు ఏమిటో చూద్దాం. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిబంధనలలో చేసిన మార్పుల ప్రకారం, మీ ఫాస్ట్ ట్యాగ్ బ్లాక్ లిస్ట్‌లో ఉన్నా లేదా క్లోజ్ చేసినా టోల్ కు వెళ్లే ముందు ఈ విషయాలను పాటించాలి. ఎవరిదైనా ఫాస్ట్ ట్యాగ్ బ్లాక్ లిస్ట్‌లో ఉంటే టోల్ బూత్ దాటడానికి 60 నిమిషాల ముందు దానిని రీఛార్జ్ చేసుకోవాలి. డ్రైవర్ అలా చేయడంలో విఫలమైతే, అతను రెట్టింపు టోల్ చెల్లించాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనాలు మినహా అన్ని రకాల వాహనాలపై ఫాస్ట్‌ట్యాగ్‌లను ఇన్‌స్టాల్ చేయడం తప్పనిసరి అని గుర్తించుకోండి. కొత్త నిబంధనల ప్రకారం, ఒక వాహనం ఫాస్ట్ ట్యాగ్ కలిగి ఉన్నప్పటికీ తక్కువ బ్యాలెన్స్ కలిగి ఉంటే లేదా బ్లాక్‌లిస్ట్‌లో ఉంటే అది టోల్ ప్లాజా గుండా వెళ్ళడానికి అనుమతి ఉండదు. ఒక వ్యక్తి తగినంత బ్యాలెన్స్ లేకుండా టోల్ దాటడానికి ప్రయత్నిస్తే, అతను జరిమానా చెల్లించాల్సి రావచ్చు. టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్ సజావుగా ఉండేలా, సమయానికి ఫాస్టాగ్ రీఛార్జ్ చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించడానికి ఈ నియమం అమలు చేసింది. ప్రయాణికుల సౌలభ్యం కోసం ఒక చిన్న గ్రేస్ పీరియడ్‌ను అందించింది. ఇది డ్రైవర్లు తక్కువ బ్యాలెన్స్ అలర్ట్ అందుకున్నప్పుడు వారి ఫాస్ట్ ట్యాగ్ ను సకాలంలో రీఛార్జ్ చేసుకునే అవకాశాన్ని ఇస్తుంది. ఈ చొరవ టోల్ ప్లాజాకు చేరుకునే ముందు తగినంత బ్యాలెన్స్‌ను నిర్ధారించడంలో సహాయపడుతుంది. తద్వారా లావాదేవీ వైఫల్యం, జరిమానాల అవకాశాలను




తగ్గిస్తుంది. లావాదేవీలలో జాప్యం సమస్యను కూడా పరిగణనలోకి తీసుకుంది. టోల్ ప్లాజా దాటిన 15 నిమిషాల్లోపు చెల్లింపు పూర్తి కాకపోతే, ప్రజలు అదనపు ఛార్జీలు చెల్లించాల్సి రావచ్చు. సకాలంలో చెల్లింపును నిర్ధారించడానికి, టోల్ ప్రక్రియను వేగవంతం చేయడానికి ఈ నియమం రూపొందించారు. కొత్త ఫాస్ట్ ట్యాగ్ నియమాలు టోల్ వసూలును సులభతరం చేయనుంది. తద్వారా హైవే ప్రయాణికులు ఇబ్బంది లేని ప్రయాణ అనుభవాన్ని పొందవచ్చు.

## ఎల్ఐసీ ఏజెంట్ల కోసం ఒక వ్యక్తి కార్యాలయం ఆన్‌లైన్ సేవ ప్రారంభం

LIC

**హైదరాబాద్, నినాదం:**

తమ విక్రయ బృందాన్ని శక్తివంతం చేయడానికి మరియు పాలసీదారులకు 24x7 డిజిటల్ సేవలను అందించడానికి నిరంతర ప్రయత్నాలలో భాగంగా, ఎల్ఐసీ నేడు తమ ఏజెంట్ల ద్వారా "ఒక వ్యక్తి కార్యాలయం" (ఓఎంఓ) ఆన్‌లైన్ సేవను ప్రారంభించింది. ఒక వ్యక్తి కార్యాలయం ద్వారా, ఎల్ఐసీ తమ విక్రయ బృందానికి - ఏజెంట్లు, అభివృద్ధి అధికారులు, సీనియర్ బిజినెస్ అసోసియేట్స్, చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్లు, అసోసియేట్స్ మరియు చీఫ్ ఆర్గనైజర్‌లతో కూడిన సమగ్ర డిజిటల్ పర్యావరణ వ్యవస్థను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది వారి రోజువారీ కార్యకలాపాలకు సహాయపడుతుంది, వారి సామర్థ్యం మరియు ఉత్పాదకతను బలోపేతం చేస్తుంది మరియు వినియోగదారులకు మెరుగైన సేవలను అందిస్తుంది. ఈ సేవను 17-02-2025న ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎల్ఐసీ ఆఫ్ ఇండియా సిఈఓ & ఎండీ సిద్ధార్థ మొహంతి మాట్లాడుతూ, ఇది విక్రయ బృందం చేతిలో ఒక కీలక సాధనంగా ఉంటుందని, జీవిత బీమాను ప్రోత్సహించడానికి మరియు ఎల్ఐసీ వినియోగదారులకు ఎప్పుడైనా, ఎక్కడైనా సేవలను అందించడానికి ఉపయోగపడుతుందని అన్నారు. '2047 నాటికి అందరికీ బీమా' అనే లక్ష్యాన్ని సాధించడానికి ఇది ఎంతో దోహదపడుతుందని ఆయన అన్నారు.ఓఎంఓ ఏజెంట్లకు పాలసీల డిజిటల్ విక్రయంలో సహాయపడటానికి, వివిధ రకాల సేవలకు సంబంధించి వినియోగదారులకు అమ్మకం తర్వాత సేవలను అందించడానికి, వారి వ్యాపారాన్ని ట్రాక్ చేయడానికి మరియు వారికి శిక్షణ మరియు జ్ఞాన కేంద్రంగా పనిచేయడానికి ఉద్దేశించబడింది. సంక్షిప్తంగా, ఇది విక్రయ బృందం చేతిలో మొబైల్ డిజిటల్ కార్యాలయం మరియు అన్ని వ్యాపార మరియు సేవల అవసరాలకు సులభంగా ఉపయోగించగల ఒక-స్టాప్ పరిష్కారంగా అభివృద్ధి చెందాలని యోచిస్తోంది. ఇది వారి మొబైల్ ఫోన్‌ల ద్వారా అందుబాటులో ఉంటుంది, తద్వారా వారిని ప్రతి విధంగానూ ఆత్మనిర్భర్ చేస్తుంది.ఈ సేవలు కస్టమర్‌లను ఆన్‌బోర్డ్ చేయడానికి ఆనందం (ఏఎన్ఏఎన్ డీఏ (ఆత్మ నిర్భర్ ఏజెంట్స్ న్యూ బిజినెస్ డిజిటల్ అప్లికేషన్) ప్లాట్‌ఫారమ్ ద్వారా అందించబడతాయి మరియు ప్రీమియం కాలిక్యులేటర్, బెనిఫిట్ ఇలస్ట్రేషన్, ఇ-ఎన్ఏసీహెచ్ రిజిస్ట్రేషన్, చిరునామా మార్పు, ఆన్‌లైన్ లోన్ అభ్యర్థన, పునరుద్ధరణ ప్రీమియం చెల్లింపులు, క్లెయిమ్ సంబంధిత అవసరాల సమర్పణ మొదలైన లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది ఏజెంట్‌లు వినియోగదారులకు సహాయపడటానికి జ్ఞాన కేంద్రం, వివిధ బీమా మరియు ఆరోగ్య సంబంధిత కాలిక్యులేటర్‌లు, కార్యాలయ లొకేటర్, నెఫ్ట్ శోధన మొదలైనవాటిని కూడా కలిగి ఉంటుంది.వినియోగదారుల మారుతున్న అవసరాలకు అనుగుణంగా ఈ అప్లికేషన్‌కు మరిన్ని ఫీచర్లను దశలవారీగా జోడించాలని యోచిస్తున్నట్లు ఎల్ఐసీ ఒక ప్రకటనలో తెలిపింది.

## పొత్తరవేని క్రాంతికి ఘనంగా సన్మానం



**మంథని ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్):** మంథని విద్యార్థి యువత వ్యవస్థాపక అధ్యక్షులు కొండెల మారుతి ఆధ్వర్యంలో రక్తదాన ప్రదాత దాదాపు 49సార్లు రక్తాధానం 12 సార్లు ప్లేట్లెట్స్ అందించి గవర్నర్ ద్వారా సన్మానింపబడిన మంథని మున్సిపల్ బోయిన్ పేట్ కి చెందిన పోతరవేని క్రాంతికుమార్ ను సోమవారం ఘనంగా పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ కరీంనగర్ పెద్దపల్లి గోదావరిఖని నుండి రక్తం ప్లేట్లెట్స్ అవసరం ఉండి ఎవరు మమ్మల్ని సంప్రదించిన అది ఏ గ్రూప్ అయినా వారికి రక్తం అందిస్తామన్నారు.ఎలాంటి అపోహలు అనుమానాలు లేకుండా ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువత రక్త దానం చేయడానికి ముందుకు రావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొండపాక సత్యప్రకాష్ , బోగోజు శ్రీనివాస్ , నారమల్ల కృష్ణ , సబ్బని సంతోష్, చిదురాల మధుకర్ రెడ్డి వేముల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ సారే కావాలనుకుంటున్న తెలంగాణ ప్రజలు

### -మాజీ ఎంపీపీ పొన్నమనేని బాలాజీ రావు

### -ఘనంగా మాజీ సీఎం కెసిఆర్ జన్మదిన వేడుకలు



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్):**
మళ్ళీ సారే కావాలని (మాజీ సీఎం కేసీఆర్) తె లంగాణా రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని మాజీ ఎంపీపీ పొన్నమనేని బాలాజీ రావు అన్నారు.సో మవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని నె హ్రూ విగ్రహం వద్ద తెలంగాణ రాష్ట్ర సాధకుడు,బి ఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర రావు పుట్టినరోజును పురస్కరించు కొని బిఆర్ఎస్ శ్రేణుల కేక్ కట్ చేసి, పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.అనంతరం మాజీ ఎంపీపీ మాట్లాడు తూ,రైతు బంధువు మా జీ ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప దేండ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల లో అభివృద్ధి చెందిందని అన్నారు.కానీ పదేండ్లలో జరిగిన అభివృద్ధి గడిచిన సంవత్సర కాలంలో చాలా నష్టానికి గురవుతుందనివిమర్శించారు. కే సీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవ్వాలని ప్రజలు కోరు కుంటున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగాకోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు పారుపల్లి గుణ పతి, బుర్ర శ్రీనివాస్ గౌడ్,సుర శ్యామ్, దయాకర్, తాళ్లపల్లి మనోజ్ గౌడ్,పురం రమణ,పసిడ్ల సంప త్, బాబు రావు,గుర్రాల శ్రీనివాస్,అంజయ్య గౌడ్, ఉల్లంగుల శ్రీనివాస్,తో పాటు మాజీ సర్పంచులు, ఎంపీటీసీ లు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి 22 వరకు ప్రాక్టికల్ పరీక్షలు

### -ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి కల్పన

**పెద్దపల్లి, ఫిబ్రవరి 17 (నినా దం న్యూస్):**
ఫిబ్రవరి 18 నుంచి 22 వరకు జూనియర్ కళాశాల యందు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుం దని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి కల్పన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.పెద్దపల్లి జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 3 నుంచి 17 వరకు జరుగుతున్నాయని తెలిపారు. ఒకటి, రెండు, మూడో విడతల ప్రాక్టికల్ పరీక్షలలో గైర్హాజరైన విద్యార్థిని విద్యార్థులకు ఫిబ్రవరి 18 నుంచి ఫిబ్రవరి 22 వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురు పెద్దపల్లి యందు తిరిగి నిర్వహించడం జరుగుతుందని, దీనికి సంబంధించిన టైం టేబుల్ వివరాలు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ లను సంప్రదించాలని తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని గైర్హాజరైన విద్యార్థిని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి కల్పన ఆ ప్రకటనలో తెలిపారు.

## హాజరు ఎఫ్.ఆర్.ఎస్ ద్వారా నమోదు చేయాలి

### -కలెక్టర్ కోయ శ్రీ.హర్ష

**పెద్దపల్లి,ఫిబ్రవరి 17(నినాదం న్యూస్):**
ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థి హాజరు ఎఫ్.ఆర్.ఎస్ ద్వారా కట్టుదిట్టంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ పెద్దపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో బాలికల



హాజరు శాతం, మధ్యాహ్నం భోజన పథకం అమలు, విద్యార్థినులకు అందుతున్న విద్య బోధన తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు, పనిచేసే ఉపాధ్యాయుల హాజరు ఎఫ్.ఆర్.ఎస్ ద్వారా నమోదు చేయాలని,హాజరు వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి బిల్లులు త్వరగా జనరేట్ చేసి చెల్లింపులు జరిపేందుకు కూడా ఎఫ్.ఆర్.ఎస్ హాజరు పరిగణలోకి తీసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందాలని, ప్రతి విద్యార్థిని పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,పాఠ్యాంశాలు విద్యార్థినులకు అర్థమయ్యే విధంగా బోధన జరగాలని అన్నారు.10వ తరగతి పాఠశాల విద్యార్థినిలు మంచి మార్కులతో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి,ఎంఈఓ సురేందర్, ప్రధానోపాధ్యాయురాలు అరుణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సుగ్లం పల్లిలో మాజీ సీఎం కెసిఆర్ జన్మదిన వేడుకలు



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 17(నినాదం న్యూస్):**
తెలంగాణ తొలి ముఖ్య మంత్రి, రాష్ట్ర సాధకుడు, బిఆర్ఎస్ అధినేత రైతుబంధుమాజీ ముఖ్య మం త్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుక లు సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రంలోని సుగ్లాం పల్లిలో మాజీ ఒకటవ వార్డ్ కౌన్సిలర్ పసిడ్ల మమ త సంపత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశా రు. ఈ కార్యక్రమంలో ఒకటవ వార్డు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరు లు ఉన్నారు.

# ఏడాదిలో 57వేల ఉద్యోగ నియామకాలు చేశాం

- యువతలో నైపుణ్యం పెంపుకు స్కిల్ యునివర్శిటీ
- పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు



**కరీంనగర్, ఫిబ్రవరి 17(నినాదం న్యూస్ ):**
దేశానికి రోల్ మోడల్ గా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. పెద్దపల్లి రామగుండం మంథని నియోజక వర్గాల్లో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఏడాది కాలంలో 57 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టిన ఘనత కాంగ్రెస్ కే దక్కిందన్నారు. నిరుద్యోగ, యువతకు నైపుణ్యం పెంచేందుకు హైదరాబాద్ లో అంతర్జాతీయ ప్రమాణాలతో స్కిల్ యూనివర్శిటీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 317 జీఓను వెసులుబాటును బట్టి ఉపాధ్యాయులకు సొంత జిల్లాల్లో పని చేసే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టామని గుర్తు చేశారు. కులగణన దేశానికి దిక్సూచిగా నిలిచిందని, ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు మాట్లాడే తీరు సరిగా లేదని, చేతనైతే రాజ్యాంగ సవరణ ద్వారా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మించితీరుతామని, అపోహలొద్దని హామీ ఇచ్చారు. ఈ నెల 27 జరిగే కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు.విప్ అడ్లూరి లక్ష్మన్ కుమార్, ఎమ్మెల్సీ భాను ప్రసాద్ రావు, ఎమ్మె ల్యేలు విజయ రమణారావు, మాక్కాన్ సింగ్, కాంగ్రె స్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం నీడలో మున్సిపల్ అధికారుల పనితీరు

- సమస్య పరిష్కారానికి ఇంత బద్ధకమా
- ప్రమాదం జరుగుతేగాని పట్టింపు లేదా



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్):**
సుల్తానాబాద్ మున్సిపల్ అభివృద్ధిలో భాగంగా మున్సిపల్ కేంద్రంలోని శివాలయం నుండి చెరు వు కట్ట వరకు రోడ్డు వెడల్పు చేసి సిసి రోడ్డును నిర్మించారు. సీసీ రోడ్డు నిర్మాణం లో భాగంగా త్రా గునీటి సరఫరా పైప్ లైన్ వాల్ మరమత్తు కోసం గొయ్యి తీయగా నెలలు గడుస్తున్నా మరమ్మత్తు లు నేటి వరకు కూడా చేయడం లేదు. గొయ్యిని పూడ్చడం లేదు. దీన్నిబట్టి చూస్తుంటే మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం ఏమిటో కనిపిస్తుంది. సమ స్య పరిష్కారానికి ఇంత బద్ధకమా అని బల్దియా అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు, వాహనదారులకు ఏదైనా ప్రమాదం జరి గితే ఎవరు బాధ్యత వహిస్తారు అని ప్రశ్నిస్తున్నా రు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్రాగునీటి సరఫరా వాల్ ను మరమ్మతు చేసి గొయ్యిని పూ డ్చాలని ప్రజలు కోరుచున్నారు.

**గొయ్యిని వెంటనే పూడ్చాలి..**
**బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు ఏకశీల శ్రీనివాస్**



పట్టణంలో అతి ముఖ్యమైన ప్రధా న రోడ్డు లో చెరువు రోడ్డు ఒకటి, పెద్దపల్లి పోవడానికి ఈ రోడ్డు ప్రధానమైనది. నిత్యం ఈ రోడ్డుపై ట్రాక్టర్లు,ద్వి చక్ర వాహనాలు నడుస్తుంటాయి. సిసి రోడ్డు నిర్మిం చారేగాని, రెండు నెలల క్రితం తవ్విన గొయ్యిని పూడ్చక పోవడం అధికారుల నిర్లక్ష్యం ఏమిటో అ ర్థమవుతుందని అన్నారు. ఇప్పటికైనా అధికారు లు నిర్లక్ష్యాన్ని వదిలి గొయ్యిని పూడ్చాలని కోరా రు.

## అతివలకు అండగా 'భరోసా' కేంద్రం

- రామగుండం సీపీ శ్రీనివాస్



మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్): మహిళలు నిత్యం ఎదుర్కొనే సమస్యలకు తక్షణ పరిష్కారం చూపేలా భరోసా కేంద్రాలు ఆత్మస్థైర్యం నింపుతున్నాయని రామగుండం సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు సోమవారం సీసీసీలో భరోసా కేంద్రం ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి కేసుల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, అమ్మాయిలు, పిల్లలు టీజింగ్, ఆకతాయిల లైంగిక వేధింపులు, అత్తింటి వారి ఆగడాలు, గృహహింస బారిన పడినవారు పోలీస్ స్టేషన్ కు వెళ్లడం ఇబ్బందికరంగా ఉన్నప్పుడు చరవాణి, స్వయంగా ఈ కేంద్రాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు. బాధిత మహిళలకు అన్ని రకాల సేవలు అందేలా కేంద్రం చూస్తుందన్నారు. చివరివరకు బాధితుల అండగా ఉంటూ నేరస్తులకు శిక్ష పడేలా చేస్తుందని పేర్కొన్నారు. వేధింపుల నుంచి బయటపడాలంటే మహిళలు మౌనం వీడాలని పేర్కొన్నారు. సమస్యలతో వచ్చిన వారికి కౌన్సెలింగ్ ఇప్పించి బాధ నుంచి విముక్తి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి భాస్కర్, ఏసిపి ప్రకాష్, మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, నస్పూర్ ఎస్సై సుగుణాకర్, శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్, షీ టీం ఎస్సై హైమ తదితరులు పాల్గొన్నారు.


## కేసీఆర్‌తోనే సింగరేణి కార్మికుల జీవితాల్లో వెలుగులు

- కార్మిక క్షేత్రంలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు
- టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి



**మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 17(నినాదం న్యూస్):** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సింగరేణి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపారని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. కేసీ ఆర్ జన్మదినం పురస్కరించుకొని సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలోని టీబీజీకేఎస్ కార్యాలయం వద్ద ఏరియా వైస్ ప్రెసిడెంట్ పెట్టం లక్ష్మణ్ గారి ఆధ్వర్యంలో చెట్లు నాటి , కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కోల్పోయిన వారసత్వ ఉద్యోగాలను కారుణ్య నియామకాల పేరిట పునరుద్ధరించిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని పేర్కొన్నారుని. కోల్ ఇండియాలో లేని హక్కులను కార్మికులకు ఇప్పించామని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ లాలా, గోన్ స్వామి, గొర్ల సంతోష్, బుడ్డి ప్రసాద్, వెంకట రెడ్డి,దుర్గం రవి కుమార్, పాదం శ్రీనివాస్, జగదీష్,గోగర్ల గోపాల్, గోవిందుల రమేష్,జైపాల్ రెడ్డి, తిరుపతిరెడ్డి, గడ్డం సుధాకర్, దేవేందర్, మధు,కార్యకర్తలు పాల్గొన్నారు

## కౌటాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి,ఫిబ్రవరి17(నినాదం న్యూస్):**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా విద్యుత్ కౌటాల విద్యుత్ సెక్షన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు కౌటాల సెక్షన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రాజేశ్వర్ తెలిపారు. కొత్తగా 132 కెవీ విద్యుత్తు లైను నిర్మాణంలో ఉన్నందువల్ల ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు 33 కెవీ రవీంద్ర నగర్ ఫీడర్ మీద విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు. దీంతో 11 కేవీ అనుకోడా మరియు 11 కేవీ చీపురుదుబ్బ ఫీడర్ మీద లైన్ క్లియర్ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కోయయాపల్గూడ,యాపలగూడ, నాగేపల్లి, గురుడ్ పేట, కన్నేపల్లి, కనికి, బోదంపల్లి, రవీంద్రనగర్, బాబాపూర్, గంగాపూర్, బాబాసాగర్, చింతలమానెపల్లి, రుద్రాపుర్, కర్జవెల్లి, ముంజంపల్లి, బారెగూడ, పోతేపల్లి మరియు కాటేపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన ఒక ప్రకటనలో కోరారు.

## నేడే ఆర్ఎంపీ, పీఎంపీల ఆత్మ గౌరవ మహాసభ

**మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్):**
తెలంగాణ రాష్ట్రంలోని ఆర్ఎంపీ, పీఎంపీ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మంగళవారం హైదరాబాద్ లోని ఇందిరా పార్కులో నిర్వహించే ఆత్మగౌరవ మహాసభను విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ కు చెందిన సీనియర్ గ్రామీణ వైద్యులు సింగని వీరస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలోని గ్రామీణ వైద్యులపై టీజీఎంసి, ఎన్ఎంసి, ఐఎంసి డాక్టర్ల ఆధ్వర్యంలో దాడులు, అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొ న్నారు.



తరతరాల నుంచి గ్రామీణ వైద్యులుగా వైద్యం (ప్రాథమిక కేంద్రం) చేస్తూ జీవనోపాధి కొనసాగిస్తూ తన కుటుం బాన్ని పోషించుకుంటూ చాలీచాల ని డబ్బులతో పేద ప్రజలకు సేవ చేస్తున్నామని పేర్కొన్నారు.

## సహకార సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తా

### -చిన్నకల్వల పిఎసిఎస్ చైర్మన్ మోహన్ రావు



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్):**
6 నెలలు పదవి కాలం పొడిగించడంతో సహకార సంఘాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశం ల భించిందని చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ స హకార సంఘంఅధ్యక్షుడు దేవరనేని మోహన్ రా వు సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన పెద్దపల్లి జిల్లాఎలిగేడు మండలం శివపల్లి గ్రామం లోనిఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్లను కలిసి సహకార సంఘ పాలకవర్గ పదవీకాలంఆరు నెలలు పొడిగించి నం దుకు కృతజ్ఞతలు తెలియజేసి, శాలువాతో సన్మా నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్ర భుత్వం మరో ఆరు నెలలు పదవీకాలం పొడిగించి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని మరిం త అభివృద్ధి చేసే బాధ్యత పెట్టిందని అన్నారు. స హకార సంఘం ద్వారా రైతులకు మరిన్ని సేవలం దిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో రమేష్, పాలకమండలి సభ్యులు పాల్గొ న్నారు.

## కెసిఆర్ పుట్టినరోజు వేడుకలు

### -మొక్కలు నాటిన బిఆర్ఎస్ నాయకులు

### -రోగులకు బ్రెడ్ పండ్లు పంపిణీ



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 17(నినాదం న్యూస్):** సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసు పత్రిలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి వర్యులు కల్వకుంట్ల చంద్రశేఖ ర్ రావు జన్మదినం సందర్భంగా ఆసుపత్రి ఆవరణ లో పెద్దపెల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పిలుపు మేరకు బి.ఆర్.ఎస్ పార్టీ యువజన శాఖ ఆధ్వర్యంలో మొక్కలునాటారు.అనంతరం రోగు లకు బ్రెడ్,పండ్లు పంపిణీ చేయడం చేశారు.ఈ కా ర్యక్రమంలో యూత్ నాయకులు సుల్తానాబాద్ పట్టణ యువజన అధ్యక్షులు ఎండి వహీద్, వైస్ ప్రెసిడెంట్ గాజుల అరుణ్ కుమార్,10,6,12,1 వా ర్డుల యూత్ ప్రెసిడెంట్ లు ఎండి సమీర్ , ఆరెపల్లి ప్రశాంత్,ఎండి సల్మాన్ మోయిజ్,ప్రశాంత్ సీనియ ర్ యూత్ నాయకుడు తిరుపతి వార్డ్ అధ్యక్షుడు పెంట చరణ్,విజయ్ బబ్లు,శేఖర్ ,కృష్ణ యువకు లు తదితరులు పాల్గొన్నారు.

## పత్తిపాకలో దోమల నివారణకు చర్యలు




**ధర్మారం ఫిబ్రవరి 17 ( నినాదం న్యూస్)** మండలంలోని పత్తిపాక గ్రామంలో ఈరోజు దోమల నివారణకు గ్రామపంచాయతీ కార్యదర్శి తాళ్ల కిరణ్, ఆధ్వర్యంలో దోమల నివారణ కు ఫాగింగ్ మిషన్ తో వాడవాడలా స్ప్రే చేశారు. గతంలో ఈ గ్రామంలో నుంచి ప్రజలకు తీవ్ర నష్టం కలిగిం చి న సంగతి విధితమే. ఇట్టి సంఘటనను దృష్టిలో ఉంచుకొని మండల ప్రత్యేక అధికారి వీర బుచ్చయ్య, మండల అభివృద్ధి అధికారి ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు దోమల నివారణ చర్యలు చేపట్టడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది కారోబార్ ఏదుల్ల రవికుమార్ , వేగోళం భాస్కర్ , రమేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మల్క కొమురయ్య గెలుపు..
# టీచర్ల జీవితాల్లో మలుపు

- బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపుతోనే విద్యావ్యవస్థ ప్రక్షాళన
- నిరుద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై కొట్లాడేది వీళ్లే..
- పార్టీ నాయకుల సమావేశంలో కేంద్ర మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్ )**
కరీంనగర్ – నిజామాబాద్ – ఆదిలాబాద్ – మెదక్ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య గెలుపుతోనే టీచర్ల జీవితాల్లో మార్పొస్తుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్‌లోని కొండా సత్య లక్ష్మీ గార్డెన్‌లో ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లాల్లోని బీజేపీ మండలాధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌తోపాటు ఎంపీలు రఘునందన్ రావు, జి.నగేశ్, ఎమ్మెల్యేలు కాటేపల్లి వెంకటరమణారెడ్డి, పాయల శంకర్, పాల్వాయి హరీష్ బాబు మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, చింతల రామ చంద్రారెడ్డి, బొడిగె శోభ, జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... 'బీజేపీ కొత్త మండలాధ్యక్షులుగా నియమితులైన తరువాత తొలిసారిగా ఎదురవుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీ దమ్ము చూపించండి. పీపుల్స్ పల్స్ సహా అనేక సర్వే సంస్థలు ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని స్పష్టం చేస్తున్నాయి. కాంగ్రెస్ కు అభ్యర్థులు దొరకక బయటనుండి అద్దెకు అభ్యర్థులను తెచ్చుకున్నాయి. బీఆర్ఎస్ అసలు పోటీలోనే లేదు. ఎన్నికల ఫలితాల తరువాత నుండి మళ్లీ అధికారంలోకి వచ్చేదాకా రాష్ట్రంలో బీజేపీయే ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించబోతోంది' అని వెల్లడిరచారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరును చూస్తుంటే ప్రభుత్వం ఉంటుందో ఊడుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బాకీల కాంగ్రెస్ సర్కార్‌ను బండకేసి బాదాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు ఒక్క బీజేపీకే ఉందన్నారు. నిరుద్యోగులు, టీచర్లు, ఉద్యోగుల పక్షాన నిరంతరం కొట్లాడి జైలుకు పోయింది మేమేనన్నారు. కరీంనగర్ – నిజామాబాద్ – ఆదిలాబాద్ – మెదక్ జిల్లాల పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డిని కూడా ఆదరించాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కోరారు. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో మేధావులంతా గుణపాఠం చెప్పాలని కోరుతున్నానన్నారు.

**కష్టజీవి కొమురన్న : ఎమ్మెల్యే పైడి**
ఎన్నికల ప్రచారంలో భాగంగా బిజెపి టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య అంకాపూర్‌లో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఇంటికి వెళ్లి తన కుమారుడి వివాహ పత్రిక అందజేశారు. తరువాత ఎన్నికల ప్రచారం ఎలా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట్లాడుతూ మల్క కొమరన్న కష్టపడే తత్వం కలవాడని తెలిపారు. కిందిస్థాయి నుండి వచ్చాడు కాబట్టి పేదవాళ్ల సమస్యలు ఎలా ఉంటాయో తనకు తెలుసని విద్యావ్యవస్థలో మూడు దశాబ్దాలు పైగా ఉన్నాడు కాబట్టి ఉపాధ్యాయుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని వెల్లడిరచారు. ఉపాధ్యాయులందరికీ నా చేతులు జోడిరచి అడుగుతున్నా. ఈసారి మల్క కొమురన్నకి అవకాశం కల్పించండి అని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి మూడుకు మూడు స్థానాలు గెలుస్తుందని రాకేష్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో మోడీ హవా నడుస్తుంది. ఇటీవల జరిగిన ఢల్లీ ఎన్నికల్లో గెలిచి చూపించాం త్వరలో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బిజెపి అధికారులకు వస్తుందని ఆయన అన్నారు.

## దాతృత్వాన్ని చాటిన డిగ్రీ కళాశాల అధ్యాపకులు

**ఖమ్మం, ఫిబ్రవరి17(నినాదం న్యూస్):** ప్రార్థించే పెదవులకన్న–సహాయంచేసే చేతులు మిన్న అన్న నానుడి ని నిజం చేస్తూ సోమవారం నాడు స్థానిక అన్నం ఫౌండేషన్ అనాధ ఆశ్రమాన్ని ఎస్.ఆర్.బి.జి.ఎన్.ఆర్ కళాశాల హిందీ– మైక్రోబయాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో అధ్యాపకులు విద్యార్థులు ఆశ్రమాన్ని సందర్శించి యాభై కేజీల బియ్యాన్ని వితరణ గా అందజేశారు.ఈసందర్భంగా అన్నం శ్రీనివాస రావు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవగా భావించి మానవీయత ను వ్యక్తం చేసిన అధ్యాపకులను, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ, హిందీ విభాగాధిపతులు డా.అనితకుమారి, డా.గౌస్ షేక్, అధ్యాపకులు మధు, వివిధ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు .



# ఇసుక అక్రమ రవాణాపై నిరంతర నిఘా

### అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్పీ కిరణ్ ఖరే



**మహాదేవపూర్ ఫిబ్రవరి 17,(నినాదం న్యూస్):**
ఇసుక అక్రమ రవాణాపై నిరంతరాన్నిగా కొనసాగుతుందని అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే హెచ్చరించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో ని ఆయా ఇసుక క్వారీ లలో పర్యటించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇసుక సరఫరా జరగాలని జీరో బిల్లులు, డబల్ ట్రిప్పు,అదనపు లోడు, నకిలీ బిల్లులు, తప్పుడు వాహనాలలో రవాణా, గమ్యస్థానం లాంటి ఉల్లంఘనాలు, అనుమతి లేకుండా ఇసుకను తరలించడం, అక్రమంగా నిలువలు చేయడం లాంటి పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అలాంటి వారిపై ప్రివెన్షన్ ఆఫ్ డామేజ్ లు పబ్లిక్ ప్రాపర్టీ( పి డి పి పి )చట్టం, మైండ్ సన్ మినరల్స్ చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మీదకు నిర్దేశించిన ప్రాంతంలోని చెల్లించి ఇసుకతో చేపట్టాలని అక్రమాలకు పాల్పడేవారు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవనిసూచించారు. అక్రమ రవాణా పై పోలీసుల నిరంతర పర్యవేక్షణ ఉంటుందని ప్రతి ఒక్కరు నిబంధనలకు లోబడి వ్యవహరించాలని తెలిపారు. అనంతరం ఆయా క్వారీలలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. విజిలెన్స్ అధికారులు సైతం ఆయా కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు.



# రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది కేసీఆర్

- ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారు : మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్
- మంథనిలో ఘనంగా మాజీ సీఎం జన్మదిన వేడుకలు

**మంథని ఫిబ్రవరి 17 (నినాదం న్యూస్):**
పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి బారత దేశ చిత్రపటంలో అగ్రస్థానంలో నిలిపిన గొప్ప నాయకులు కేసీఆర్ అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా మంథని పట్టణంలోని ముక్తి ఆశ్రమ ఆవరణలో మొక్కలునాటిన అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు కేసీఆర్ ఉద్యమంతోనే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని, అలాంటి స్వరాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపించారని అన్నారు. ఈనాడు తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉండటానికి కేసీఆర్ సాధించిన తెలంగాణ రాష్ట్రమే అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. అయితే బంగారు తెలంగాణాగా తీర్చిదిద్దాలనే కేసీఆర్ కలలు మధ్యలోనే ఆగిపోయాయని, ఈ క్రమంలో ప్రజలు సైతం శోక సముద్రంలో మునిగిపోయారని ఆయన వాపోయారు. కేసీఆర్ పాలన మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన అన్నారు. అలాంటి మహనాయకుడు ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని, ఆయన స్థాపించిన పార్టీలో పనిచేయడం అదృష్టంగా బావించాలన్నారు. అలాగే కేసీఆర్ కన్న కలలను సాకారం చేయాల్సిన బాధ్యత కూడా మనపైనే ఉందని, మళ్లీ కేసీఆర్ పాలన వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలన వచ్చే వరకు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని మంథని నియోజకవర్గ ప్రజల పక్షాన కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నియోజకవర్గ ప్రజల పక్షాన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



**ఉప్పట్లలో....**
మంథని మండలం ఉప్పట్ల గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను గ్రామ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మినీ వాటర్ ఫ్రిజ్‌ను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ చేతుల మీదుగా అందజేశారు. వేసవికాలంలో విద్యార్థుల దాహార్తీ తీర్చేలా మినరల్ కూల్ వాటర్ అందించేలా ఫ్రిజ్‌ను అందించాలనే ఆలోచన అభినందనీయమని స్థానిక నాయకులను కొనియాడారు. అనంతరం గ్రామంలో ప్రధాన కూడలిలో బాణాసంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

నినాదం సినిమా

# మరో ఘనతను దక్కించుకున్న అలియాభట్



బాలీవుడ్ క్యూట్ బ్యూటీ అలియాభట్‌కు మరో ఘనత సాధించింది. ఇన్‌స్టాగ్రా మ్‌లో ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిభావంతమైన హీరోయిన్ల జాబితాలో రెండో స్థానంలో నిలిచారు. ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ ప్లాట్‌ఫామ్ హైప్ ఆడిటర్ తాజాగా విడుదల చేసిన నివేదికలో అలియా సెకెండ్ ప్లేస్ సొంతం చేసుకుంది. జెన్నిఫర్ లోపెజ్ వంటి అంతర్జాతీయ నాయికలను వెనక్కినెట్టి అలియా టాప్‌లో ఉండడం ప్రత్యేకత సంతరించుకుంది. ఈ సందర్భంగా అభిమానులు ఆమెను విష్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో అలియాకు ఉన్న ఫాలోయింగ్ గురించి తెలిసిందే! ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెను 8 కోట్ల మందికి పైగా ఫాలో అవుతున్నారు. ఎప్పుడూ తన సినిమా, వ్యక్తిగత విశేషాలను అలియా ఫ్యాన్స్‌తో పంచుకుంటుంటారు. ఫొటోషూట్‌లతో ఆకట్టుకుంటారు. గతేడాది కూడా టైమ్స్ మ్యాగజైన్ విడుదల చేసిన '100 మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఆఫ్ 2024' జాబితాలోనూ చోటు దక్కించుకుంది అలియా. గత ఏడాది ఆమె 'జిగ్రా'తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ చిత్రం మిశ్రమ ఫలితాలకు పరిమితమైంది. తాజాగా అలియాకు సంబంధించిన వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ప్రభాస్, హనురాఘవపూడి కాంబినేషన్‌లో రానున్న ఫౌజీ సినిమాలో అలియా యువరాణి పాత్రలో కనిపించనున్నట్లు టాక్ నడుస్తోంది. నాగ్ అశ్విన్ సినిమాలోనూ ఆమె నటించనున్నట్లు వారలు వస్తున్నాయి. ఈ వార్తలో ఎంత వరకు నిజం ఉంది అనేది అధికారిక ప్రకటన వస్తే తప్ప తెలియదు.

# దూసుకెళ్తున్న ప్రీతి ముకుందన్

రెండో సినిమా పాన్ ఇండియా హీరోతో

టాలీవుడ్‌ను కొత్త అందాలు పలకరిస్తున్నాయి. అలా టాలీవుడ్‌కు పరిచయమైన భామే ప్రీతి ముకుందన్. ఈ చిన్నది ఇటీవలే టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు పాన్ ఇండియా సినిమాలో నటిస్తుంది. ఇప్పుడు కన్నప్ప సినిమాతో మరోసారి ప్రేక్షకులను కవ్వించనుంది ప్రీతి ముకుందన్మంచు విష్ణు హీరోగా నటిస్తున్న కన్నప్ప సినిమా పాన్ ఇండియా మూవీగా ప్రేక్షకుల ముందుకు రానుంది. మొన్నామధ్య కన్నప్ప సినిమాలో నెమలి పాత్రలో ప్రీతి ముకుందన్ నటిస్తుందని అనౌన్స్ చేస్తూ ఓ అందమైన పోస్టర్ వదిలారు. ప్రీతి ముకుందన్ టీవీ షోలో నృత్య ప్రదర్శనలలో తన కెరీర్ ను ప్రారంభించింది. ప్రీతి ముకుందన్ మొదటి మ్యూజిక్ ఆల్బమ్ 'ముత్తుము2' యూట్యూబ్ లో 4.2 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి పేరొందినది. ఆతర్వాత ఈ చిన్నదానికి సినిమా ఆఫర్స్ వచ్చాయి. శ్రీవిష్ణు సరసన 'ఓం భీమ్ బుష్' సినిమాతో హీరోయిన్‌గా మారింది. 'ఓం భీమ్ బుష్' చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది.



# రెడ్ చీరలో అదరగొడుతున్న దేత్తడి హారిక..



దేత్తడి హారిక.. ఈ చిన్నదాని గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. యూట్యూబ్ స్టార్ గా తెలుగు రాష్ట్రాల్లో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. తెలంగాణ యాసలో మాట్లాడుతూ.. యూట్యూబ్ లో అందరికీ ఇచ్చిపడేసే వీడియోలతో నెట్టింట బాగా పాపులర్ దేత్తడి హారిక. సోషల్ మీడియా ద్వారా వచ్చిన క్రేజ్ తో ఈ చిన్నది బిగ్ బాస్ గేమ్ షోలో అవకాశం అందుకుంది. నాగార్జున హోస్ట్ గా చేసిన బిగ్ బాస్ సీజన్ 4లో కంటెస్టెంట్ గా పాల్గొంది. హౌజ్‌లో తనదైన అల్లరి పనులతో టాప్ 5లో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించింది. తాజాగా తన ఇంస్టాగ్రామ్ అకౌంటులో కొన్ని ఫొటోస్ షేర్ చేసింది ఈ భామ. 9 సెప్టెంబర్ 1997న తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఓ హిందూ కుటుంబంలో జన్మించింది అందాల తార అలేఖ్య హారిక. ఈ బ్యూటీకి వంశీ కార్తీక్ అనే ఒక సోదరుడు కూడా ఉన్నాడు. చిన్నప్పటి నుంచి కొరియోగ్రాఫర్ కావాలని కోరిక. 2015లో ఆమె హైదరాబాద్‌లోని అమెజాన్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఎగ్జిక్యూటివ్‌గా చేరారు. అలేఖ్య దాదాపు మూడు సంవత్సరాలు అక్కడ పని చేసింది.

# ఆ రోజు కోసం ఎదురుచూస్తున్నా : సాయిపల్లవి



ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన మనసులోని కోరికను బయటపెట్టేసింది సహజనటి సాయిపల్లవి. ఆమెకు జాతీయ అవార్డు అందుకోవాలని ఎంతో ఆశగా ఉందట. దానికి బలమైన కారణం కూడా ఉందట. ఆ విషయం గురించి ఆమె మాట్లాడుతూ 'పెళ్లప్పుడు కట్టుకోమని మా మామ్మ నాకు ఓ చీర ఇచ్చింది. అప్పుడు నాకు 21ఏళ్లు. అప్పటికింకా నేను సినిమాల్లోకి ఎంట్రీ ఇవ్వలేదు. అసలు ఆ ఆలోచనే లేదు. పెళ్లి చేసుకునేటప్పుడు కట్టుకుందామని ఆ చీర దాచుకున్నాను. కొనేళ్లకు అనుకోకుండా 'ప్రేమమ్'తో నటిని అయ్యాను. 'ఫిదా'తో మంచి పేరొచ్చింది. ఏదో ఒక రోజు తప్పకుండా ఒక ప్రతిష్టాత్మక అవార్డు కూడా అందుకుంటాననే నమ్మకం వచ్చింది. అందుకే.. జాతీయ అవార్డు అనేది నిజంగా నాకొస్తే.. అప్పుడు మా మామ్మ ఇచ్చిన చీర కట్టుకొని ఆ అవార్డు అందుకోవాలి అని నిశ్చయించుకున్నా. నిజంగా అవార్డు వచ్చినా, రాకపోయినా.. ఆ చీర ధరించే వరకూ ఆ ఒత్తిడి మాత్రం నన్ను వదలదు.' అంటూ చెప్పుకొచ్చింది సాయిపల్లవి. నిజానిక్కూడా ఈ దఫా సాయిపల్లవికి నేషనల్ అవార్డు పక్కా అని పలువురి అభిప్రాయం. 'అమరన్'లోని ఆమె నటనకు తప్పకుండా అవార్డు వస్తుందని చాలామంది నమ్ముతున్నారు. అదే జరిగితే సాయిపల్లవి ఒత్తిడీ తీరుతుంది. అభిమానుల ఆకాంక్షా నెరవేరుతుంది.

# ఆ హీరో తెగ ఇబ్బంది పెట్టేవాడు : శ్వేతా బసు



మొదటి సినిమాతోనే కుర్రకారును హృదయాల్లో ప్రత్యేక క్రేజ్ తెచ్చుకుంది. కొన్నేళ్లుగా ఆమె తెలుగు సినిమాకు దూరంగా ఉంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తన కెరీర్ గురించి మాట్లాడారు. ఒక తెలుగు సినిమా సెట్‌లో దారుణంగా అవమానించారని అన్నారు. ఆ సెట్‌లో ప్రతిఒక్కరూ శరీరాకృతి విషయంలో ఎంతగానె ఎగతాళి చేశారని చెప్పారు. ఆ మాటలు ఎంతగానో బాధించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ''నటిగా నేను సంతృప్తిగానే ఉన్నా. నాకు నచ్చిన సినిమాలు చేశాను. ప్రస్తుతం టెలివిజన్ ఇండస్ట్రీలో రాణిస్తున్నాను. కెరీర్ పరంగా ఇబ్బంది పడిన సందర్భాలు కొన్ని ఉన్నాయి. ముఖ్యంగా ఒక తెలుగు సినిమా సెట్‌లో చాలా ఇబ్బందిపడ్డా. హీరోతో పోలిస్తే నేను ఎత్తు తక్కువగా ఉన్నానని సెట్‌లో ఉన్న ప్రతిఒక్కరూ నన్ను ఎగతాళి చ్టేసవారు. హీరో ఆరడుగులు ఉంటే ఈవిడేమో 5 అడుగులు ఉందని కామెంట్ చేసేవారు. ఇక, హీరోతో వచ్చిన సమస్య మరో స్థాయిలో ఉండేది. అతను ప్రతి సన్నివేశాన్ని మార్చేస్తుండేవాడు. గందరగోళానికి గురి చేసేవాడు. రీటేక్స్ ఎక్కువగా తీసుకునేవాడు. నిజం చెప్పాలంటే నాక్కూడా తెలుగు సరిగ్గా రాదు. కానీ, నేను ఏదో ఒక రకంగా డైలాగ్స్ నేర్చుకొని షూట్‌లో నడిపించేదాన్ని.

# ఆర్‌సీ16ని నెక్ట్‌లెవల్‌కు తీసుకెళ్తున్న బుచ్చిబాబు



అగ్ర హీరో రామ్‌చరణ్‌కి ఇమిడియట్‌గా హిట్ కావాలి. దర్శకుడు బుచ్చిబాబు సాన ద్వితీయ విఘ్నాన్ని అధిగమించాలి. అందుకే వారిద్దరికీ 'ఆర్‌సి 16'(వర్కింగ్ టైటిల్) కీలకం. ప్రీప్రొడక్షన్ నుంచే ఈ సినిమాపై బుచ్చిబాబు ప్రత్యేక శ్రద్ధ కనబరచడా నికి కారణం అదే. క్రీడా నేప థ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. తాజాగా ఈ సిని మా కథకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ఈ సినిమాలో ఓ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఉంటుందట. ఈ ఎపిసోడ్ సినిమాలో కీ రోల్ పోషిస్తుందని టాక్. అందుకే ఈ ఎపిసోడ్‌ని ఎమోషనల్‌గా ప్లాన్ చేశాడట బుచ్చిబాబు. రీసెంట్‌గా విడుదలైన రామ్‌చరణ్ 'గేమ్‌ఛేంజర్'లోనూ ఓ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఉన్న విషయం తెలిసిందే. ఆ ఎపిసోడ్‌పై ఆడియన్స్‌లో మిశ్రమ స్పందన వచ్చింది. కానీ 'ఆర్‌సి 16' ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌ని మాత్రం నెక్ట్స్ లెవల్‌లో ప్లాన్ చేశారట బుచ్చిబాబు. నెక్ట్స్ షెడ్యూల్‌లో ఈ బిగ్ ఎపిసోడ్‌ని చిత్రీకరిస్తారని సమాచారం. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, CELL : +91 80742 79741